

7, 8 తేదీల్లో నారా భువనేశ్వరి రాక

కర్నూలు (అర్బన్), మార్చి 4: నారా భువనేశ్వరమ్మ ఈనెల 7, 8 తేదీల్లో జిల్లాలో నిజం గెలివాలని పేరుతో పర్యటనకు రానున్నారని జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ బీటీ నాయుడు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లాలోని పత్తికొండ, ఆలూరు, కోడుమూరు నియోజకవర్గం పరిధిలో పర్యటిస్తారని తెలిపారు. చంద్రబాబు నాయుడును నంద్యాలలో అక్రమంగా అరెస్టు చేయడంతో ఎంతో మంది మనస్తాపానికి గురై గుండె పోటుతో మృతి చెందారని అన్నారు. ఆ కుటుంబాలను ఆమె పరామర్శిస్తారని, ఈ పర్యటనలో తగిన రక్షణ కోరుతూ జిల్లా పోలీసు సూపరింటెండెంట్‌కు లేఖ రాశామని తెలిపారు.



వేరుశనగకు తూకాలు వేసుకుంటున్న హమాలీలు

వ్యాపారుల మాయాజాలం

ఆదోని వ్యవసాయ మార్కెట్ యార్డులో వేరుశనగ వ్యాపారులు రైతులను దగా చేస్తున్నారు. మార్కెటింగ్ శాఖ నిబంధనలు ఉల్లంఘించి పాసింగ్ (గ్రేడింగ్) విధానాన్ని కొనసాగిస్తుండడంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. ఈ-నామ్ టెండర్ విధానం ఉన్నప్పటికీ వేరుశనగ వ్యాపారులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. రైతులు పండించిన వేరుశనగను గ్రేడింగ్ చేసుకొని విక్రయానికి తీసుకొస్తారు. అయినా వ్యాపారులు మాత్రం పాసింగ్ పేరుతో గంటల కొద్దీ ఆరు బయట ఎండకు శేరుశనగ రాశిని ఆరవేసి కూలీలతో శుభ్రం చేయిస్తున్నారు. ఆ తరువాత నాణ్యత లేదంటూ తక్కువ ధరకు కొంటున్నారు. ఇష్టానుసారంగా తూకాలు వేస్తున్నారు. పైగా గన్ని బ్యాగులను ఆలస్యంగా ఇస్తున్నారు. దీంతో రైతులు బేజారుకు గురవుతున్నారు.

ఆదోని (అగ్రికల్చర్), మార్చి 4:



ఆదోని పట్టణంలోని మార్కెట్ యార్డు

- పాసింగ్‌తో వేరుశనగ రైతు దగా
- టెండర్ పూర్తయినా ఆలస్యంగా తూకాలు
- క్వింటానికి రూ.500 పైగా నష్టపోతున్న రైతులు
- అధికారులు హెచ్చరించినా వ్యాపారుల బేఖాతరు

ఆదోని వ్యవసాయ మార్కెట్ యార్డ్‌కు జిల్లా నలుమూలల రైతులే కాక, అనంతపురం, తెలంగాణ, కర్ణాటక, రైతులు సైతం తమ వేరుశనగను విక్రయానికి తెస్తుంటారు. వేరుశనగ కొనుగోళ్లకు ఇక్కడ ప్రసిద్ధి కావడంతో రైతులు సీజన్‌లో 30 వేల బస్తాలకు వేరుశనగను విక్రయానికి తెస్తారు. రైతు అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకుని వ్యాపారులు తాము ఆడిందే ఆట, పాడిందే పాటగా వ్యవహరిస్తున్నారు. ఉదయం 8 గంటలకే గ్రామాల నుంచి రైతులు మార్కెట్ యార్డుకు వేరుశనగ దిగుబడును తీసుకొచ్చి కమీషన్ ఏజెంట్ దుకాణం ముందు ఉన్న ప్లాట్‌ఫారమ్‌పై వేరుశనగను రాశిగా పోసి టెండర్‌కు ఉంచుతారు.

కమీషన్ ఏజెంట్ దుకాణదారులు వాటికి ఈ-నామ్ లాట్ నెంబర్ కేటాయించి టెండర్లకు ఉంచుతారు. వ్యాపారి వచ్చి టెండర్ దాఖలు చేస్తారు. ఎవరు ఎక్కువ ధర కోట్ చేస్తారో, ఆ వ్యాపారికి సరుకు ప్రకటన చేస్తారు. ప్రస్తుతం సీజన్ తక్కువగా ఉండడంతో సరుకు 2 నుంచి 3 వేలు క్వింటాలకు మించి రావడం లేదు. వ్యాపారులు వేసిన టెండర్ డిక్లరేషన్ మధ్యాహ్నం 12-1 గంటలోపు ప్రకటిస్తారు. ఆ వెంటనే తూకాలు వేసుకొని రైతుకు రొక్కం చెల్లించాలి. అలా కాకుండా వ్యాపారులు నిబంధనకు విరుద్ధంగా రైతులు తెచ్చిన వేరుశనగ ఎండకు బాగా ఆరవేయడమే కాకుండా పాసింగ్ చేసి అంటూ అందులో వాటన్నింటిని వేరు చేసి తూర్పార పట్టుకుని తూకాలు మధ్యాహ్నం 4-5 గంటల తర్వాత వేసుకుంటారు. రైతులు ఇంటి వద్దనే బాగా ఆరబెట్టుకొని వేరుశనగన శుభ్రంగా చేసుకొని విక్రయానికి తీసుకొస్తారు. ఇంత చేసినా వ్యాపారులు ధర తగ్గించుకోవడానికి పాసింగ్ పేరుతో కాలయాపన చేస్తూ రైతుల సహనాన్ని పరీక్షిస్తున్నారు. రైతులు ఇంటికి వెళ్లే లోపు రాత్రి 10:00 గంటలు అవుతోంది. అధికారులు సైతం పట్టించుకోకపోవడంతోనే వారి ఆటలు సాగుతున్నాయని రైతులు, రైతు సంఘ నాయకులు ఆరోపిస్తున్నారు.

● గ్రేడింగ్‌తో క్వింటాకు రూ.500 పైగా నష్టం..

రైతులు తమ వేరుశనగ దిగుబడిని నాణ్యతతో ఇంటి వద్దనే గ్రేడింగ్ చేసుకొని మార్కెట్ కమిటీకి విక్రయానికి తీసుకొస్తాడు. దానివల్ల మంచి ధర పొందచ్చని ఆశతో ఇక్కడ తెస్తారు. గ్రేడింగ్ పేరుతో వేరుశనగను కూలీ చేత వేరు చేయించడం వల్ల క్వింటానికి రూ.500 వరకు తీవ్రంగా నష్టపోవాల్సి వస్తుంది. ఒక్కో రైతు ఇదు కింటాల నుంచి 50 క్వింటాళ్ల వేరుశనగను విక్రయానికి తీసుకొస్తారు. ఈ లెక్కన రైతు రూ.2 వేల నుంచి రూ.15 వేల వరకు నష్టం వస్తుంది. ఎక్కువసేపు ఎండలో ఆరబెట్టడం వల్ల కూడా తూకం తక్కువ అవ్వడంతో మరింత నష్టపోవాల్సి వస్తుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. టెండర్ ఫామ్ డిక్లరేషన్ అయిన వెంటనే ఆ లాట్‌ను దక్కించుకున్న వ్యాపారి వెంటనే తూకాలు వేసుకొని కొనగోలు చేయాల్సి ఉంటుంది. ఉద్దేశపూర్వకంగా వ్యాపారులు ఆలస్యంగా తమ గన్ని బ్యాగులను ఇవ్వడం.. తుకాలు వేసుకోవడం చేస్తున్నారు.

జిల్లాలో ఎక్కడా లేని విధానం..

జిల్లాలో ప్రధానంగా కర్నూలు, ఎమ్మిగనూరు, ఆదోని, మార్కెట్ కమిటీలో నిత్యం వేరుశనగ కొనుగోలు జరుగుతున్నాయి. అన్ని మార్కెట్ కమిటీలకు ఒకే మార్కెటింగ్ శాఖ చట్టం ఉంది. చట్టాన్ని ఉల్లంఘించి ఆదోని మార్కెట్ కమిటీలోనే వ్యాపారులు రైతులు రాశులుగా పోసి టెండర్‌కు ఉంచిన వేరుశనగ గ్రేడింగ్ (పాసింగ్) చేస్తున్నారు. అనాదిగా ఇది కొనసాగిస్తుమంటూ వ్యాపారులు బుకాయిస్తున్నారు. ఇక్కడ లైసెన్స్ కలిగి కొనుగోలు చేస్తున్న వేరుశెనగ వ్యాపారులే ఎమ్మిగనూరు, కర్నూలు మార్కెట్ కమిటీలకు వెళ్లి గ్రేడింగ్ లేకుండానే నేరుగా టెండర్ వేసి వెంటనే తూకాలు వేసుకొని ఆదోనిలోని పరిశ్రమలకు దిగుమతి చేసుకుంటున్నారు. ఎక్కడా లేని గ్రేడింగ్ విధానం ఇక్కడ ఎందుకని రైతులు ప్రశ్నిస్తున్నారు. చాలామంది రైతులు ఈ గ్రేడింగ్ విధానం వల్ల నష్టపోవాల్సి వస్తుందని కర్నూలు, ఎమ్మిగనూరు మార్కెట్ కమిటీలకు తమ దిగుబడిని తీసుకెళ్లి విక్రయించుకుంటున్నారు.

వ్యాపారంలో తీరు మారదు..

గత రెండు నెలల కిందట మార్కెట్ యార్డ్ కార్యదర్శి రామ్మోహన్ రెడ్డి దృష్టికి కొందరు రైతులు, రైతు సంఘ నాయకులు గ్రేడింగ్ వల్ల తీవ్రంగా నష్టపోతున్నామని ఆయన దృష్టికి తీసుకువచ్చారు. వ్యాపారులతో సమావేశం ఏర్పాటు చేసి నిబంధనలకు విరుద్ధంగా గ్రేడింగ్ చేస్తే లైసెన్స్ రద్దు చేస్తామని, ఈ విధానానికి స్వస్తి పలకాలని హెచ్చరించారు. అప్పటి వరకు వ్యాపారులు తల ఊపారు. నిదానంగా తాము గ్రేడింగ్ చేయకుండా కొనుగోలు చేస్తామని హామీ ఇచ్చినా, వ్యాపారులు మాత్రం వారి తీరును మార్చుకోవడం లేదు.

ఈ విధానం చట్ట విరుద్ధమని వ్యాపారులకు చెప్పాం



వ్యాపారులు పాసింగ్ (గ్రేడింగ్) కూలీలతో చేయించడం చట్ట విరుద్ధమని వారికి తెలియజేశాం. స్వస్తి పలకాలని, లేకపోతే చర్యలు తీసుకుంటామని కూడా హెచ్చరించాం. గత నెల కిందట సమావేశం పెట్టి తెలియజేశాం. ముందు నుంచి ఈ విధానం అమలులో ఉందని మొండి వాదన చేశారు. కచ్చితంగా ఈ విధానాన్ని రూపుమాపి రైతులకు న్యాయం చేస్తాం.

-రామ్మోహన్ రెడ్డి మార్కెట్ యార్డ్ కార్యదర్శి ఆదోని

కాటసాని అక్రమాలపై కమిటీ వేయాలి

- భూ కబ్జాలు, గ్రావెల్ తవ్వకాలపై నిగ్గు తేల్చాలి
- స్పందనలో కలెక్టర్‌కు మాజీ ఎమ్మెల్యే గౌరుచరిత వినతి



వినతిపత్రం ఇస్తున్న గౌరు చరిత

కల్లూరు, మార్చి 4: పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి, ఆయన అనుచరుల అవినీతి అక్రమాలపై కలెక్టర్ ఆధ్వర్యంలో కమిటీ ఏర్పాటు చేయాలని పాణ్యం టీడీపీ అభ్యర్థి, మాజీ ఎమ్మెల్యే గౌరు చరిత డిమాండ్ చేశారు. సోమవారం కలెక్టరేట్‌లో జరిగిన స్పందన కార్యక్రమంలో గౌరు చరిత, టీడీపీ నాయకులు జాయింట్ కలెక్టర్ నారపురెడ్డి మౌర్యను కలిసి వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పాణ్యం నియోజకవర్గంలో ఎమ్మెల్యే, ఆయన అనుచరులు చేస్తున్న భూకబ్జాలు, అక్రమ గ్రావెల్ తవ్వకాలను మీడియా ముఖంగా వెల్లడించామని అన్నారు. అందుకు పాణ్యం ఎమ్మెల్యే కాటసాని స్పందిస్తూ తనపై నిరాధార ఆరోపణలు చేస్తున్నారని, వివరాలు ఉంటే కలెక్టర్‌కు ఇవ్వాలని సవాల్ విసిరారని గుర్తు చేశారు. అలాగే భూకబ్జాల ఆరోపణలు నిజమని నిరూపిస్తే తమకు రాసిస్తామని చెప్పారని అన్నారు. ఈ నేపథ్యంలోనే జేసీని కలిసి పాణ్యం ఎమ్మెల్యే, ఆయన అనుచరుల అక్రమాల వివరాలు అందించామని తెలిపారు. కలెక్టర్ ఆధ్వర్యంలో కమిటీ వేస్తే బాధితులంతా బయటకు వస్తారని, విచారణ జరిపితే వారికి న్యాయం జరుగుతుందని అన్నారు. ఆక్రమించుకున్న భూములు బాధితులకు అందితే చాలని, తమకు రాసి ఇవ్వాల్సిన అవసరం లేదన్నారు. వెంటనే కలెక్టరు కమిటీ ఏర్పాటు చేసి నిజాలు నిగ్గు తేల్చాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నంద్యాల జిల్లా టీడీపీ అధ్యక్షుడు మల్లెల రాజశేఖర్, గుట్టపాడు సర్పంచు మోహన్‌రెడ్డి, పాలకొలను సుధాకర్‌రెడ్డి, పునులూరు ప్రభాకర్ రెడ్డి, మాదేష్, శేఖర్ చౌదరి, రాయలసీమ విద్యార్థి విభాగం జేఏసీ చైర్మన్ శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

పల్స్ పోలియోకు విశేష స్పందన

జిల్లాలో 99.64 శాతం

కర్నూలు(హాస్పిటల్), మార్చి 4: జిల్లా వ్యాప్తంగా పల్స్ పోలియో కార్యక్రమానికి విశేష స్పందన లభించిందని జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి డా.వై. ప్రవీణ్ కుమార్ వెల్లడించారు. సోమవారం సాయంత్రం జిల్లాలో 99.64 శాతం మంది చిన్నారులకు పోలియో చుక్కలు వేసినట్లు ఆయన తెలిపారు. జిల్లా వ్యాప్తంగా 3,48,071 మంది చిన్నారులకు పోలియో చుక్కలు వేయాలని అధికారులు లక్ష్యంగా పెట్టుకోగా, రెండో రోజు 3,41,681 మంది చిన్నారులకు పోలియో చుక్కలు వేసినట్లు తెలిపారు. మిగిలిన చిన్నారులకు 5, 6 తేదీల్లో చుక్కలు వేస్తామని తెలిపారు. కర్నూలు అర్బన్‌లో ఈ నెల 6న ప్రత్యేకంగా పల్స్ పోలియో కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సోమవారం కర్నూలు మండలంలోని బి. తాండ్రపాడు, ఓర్వకల్లు మండలాల్లోని కాల్వబుగ్గ, హుశేనాపురం గ్రామాల్లో జరుగుతున్న డోర్ టూ డోర్ పల్స్ పోలియో కార్యక్రమాన్ని ఆయన సౌత్ ఇండియా రీజియన్ టీమ్ లీడర్ సందీప్ పటేల్ సందర్శించారు. ఎన్ని బూత్‌లు ఏర్పాటు చేసిందీ, ఎంత మందికి చుక్కలు వేసిందీ సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు.

ఎర్రకోట శాసనం..!

- బుట్టా రేణుకకు స్వేచ్ఛ కరువు
- ఎమ్మెల్యే చెప్పినట్టే వినాలంటే ఎలా?
- టికెట్ మార్పుపై ఊహాగానాలు





కర్నూలు, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): ఎమ్మిగనూరు నియోజకవర్గంలో సిట్టింగ్ ఎమ్మెల్యే ఎర్రకోట చెన్నకేశవ రెడ్డి తీరుపై ఆ పార్టీ నేతల్లో గందరగోళం నెలకొంది. ఇటీవల నియోజకవర్గ వైసీపీ సమన్వయకర్తగా చేనేత సామాజిక వర్గానికి చెందిన మాజీ ఎంపీ బుట్టా రేణుక బాధ్యతలు చేపట్టారు. అయితే అప్పటి నుంచి ఆమె ఎమ్మెల్యేను కాదని నియోజకవర్గంలో స్వేచ్ఛగా తిరగలేకపోతున్నారు. అయితే సిట్టింగ్ ఎమ్మెల్యే ఎర్రకోట చెన్నకేశవరెడ్డి నుంచి ఆమెకు ఆశించిన స్థాయిలో సహకారం అందడం లేదు. బీసీ మహిళ, నియోజకవర్గ వైసీపీ సమన్వయకర్తగా ఉన్నప్పటికీ ఆమె స్వతంత్రంగా ఏ నిర్ణయం తీసుకోలేని పరిస్థితి నెలకొందని నియోజకవర్గంలో ప్రచారం జరుగుతోంది. ఆమె ఎవరినైనా కలవాలంటే ఎమ్మెల్యే ఏమనుకుంటారో.. ఏ విషయమైనా స్థానిక నాయకులతో చర్చిస్తే పెద్దాయనతో మాట్లాడారా.. అని ఎదురు ప్రశ్న వేస్తున్నారు. ఈ క్రమంలో ఎమ్మిగనూరు ఎమ్మెల్యే అభ్యర్థిగా ఎందుకొచ్చాను.. అన్న మానసిక సంఘర్షణలో బుట్టా రేణుకలో ఉన్నట్లు వైసీపీలోని ఓ వర్గం నాయకుల ద్వారా సమాచారం. ఈ క్రమంలో తనకు అవకాశం ఉంటే కర్నూలు ఎంపీ టికెట్ ఇవ్వాలని బుట్టా రేణుక అధిష్టానాన్ని కోరినట్లు తెలుస్తోంది. నెల రోజుల క్రితం కర్నూలు ఎంపీ అభ్యర్థిగా మంత్రి గుమ్మనూరు జయరాంను సీఎం జగన్ ప్రకటించారు. ఆలూరు నియోజకవర్గం టికెట్ వైరి వర్గానికి చెందిన చిప్పగిరి జడ్పీటీసీ సభ్యుడు బి.విరుపాక్షికి ఇవ్వడంతో జయరాం వర్గీయులు జీర్ణించుకోలేకపోయారు. ఈ క్రమంలో గుమ్మనూరు జయరాం ఎంపీగా పోటీ చేసేందుకు ఒప్పుకోలేదు. ఇక ఆయన టీడీపీలో చేరేందుకు రంగం సిద్ధం చేసుకున్నారు. జయరాం స్థానంలో కర్నూలు ఎంపీగా బీవై రామయ్యను అధిష్టానం ఖరారు చేసినా ప్రకటించలేదు. ఇప్పుడు ఎమ్మిగనూరు కాని పక్షంలో కర్నూలు ఎంపీ స్థానానికి తన అభ్యర్థిత్వాన్ని పరిశీలించాలంటూ బుట్టా రేణుక కోరుతున్నట్లు సమాచారం. ఈ క్రమంలో ఐప్యాక్ టీం మళ్లీ సర్వే చేపడుతోంది.

ఎర్రకోట ఆజ్ఞ లేకుండా అడుగు వేయలేని పరిస్థితి..!

వైసీపీ సమన్వయకర్త బుట్టా రేణుక ఎమ్మెల్యే ఎర్రకోట చెన్నకేశవరెడ్డి ఆజ్ఞ లేకుండా ఒక్క అడుగు కూడా వేయలేని పరిస్థితి నెలకొంది. ఎవరిని కలవాలి..? ఎవరిని కలవకూడదు..? ఏ సమావేశంలో ఏమి మాట్లాడాలి..? ఇలా అన్నింటా ఎర్రకోట జోక్యంపై బుట్టా వర్గీయులు జీర్ణించుకోలేకపోతున్నారు. 2014-19లో ఎంపీగా ఉన్న సమయంలో నియోజకవర్గంలో ఆమెకు పలువురు నాయకులు, ప్రజా సంఘాల నేతలతో సన్నిహిత సంబంధాలు ఉన్నాయి. సొంత వర్గాన్ని బలోపేతం చేసుకోవడానికి కూడా ప్రయత్నాలు చేసింది. అందుకే బుట్టా రేణుకను ఎమ్మెల్యే ఎర్రకోటకు తీవ్రంగా వ్యతిరేకిస్తూ వచ్చారు. ఎమ్మెల్యేకు, తనయుడికి ఎర్రకోట జగన్‌కు సీఎం జగన్ టికెట్ నిరాకరించారు. దీంతో వీరశైవ లింగాయత్ కార్పొరేషన్ చైర్మన్ వై.రుద్రగౌడ్, మాజీ ఎంపీ బుట్టా రేణుక ప్రయత్నించారు. వీరిద్దరిని కాదని తన సన్నిహితుడైన మాచాని వెంకటేశ్‌కు టికెట్ ఇప్పించుకున్నారు. వెంకటేశ్ అభ్యర్థిత్వాన్ని ఎర్రకోట అత్యంత సన్నిహితులే వ్యతిరేకించడంతో గత్యంతరం లేక బుట్టా రేణుక అభ్యర్థిత్వాన్ని అంగీకరించారు. రుద్రగౌడ్ ఇంటికి వెళ్లి బుట్టా రేణుక కలవడం కూడా ఎమ్మెల్యే జీర్ణించుకోలేకపోతున్నారు.

మయూర వాహనంపై మల్లన్న

- పట్టువస్త్రాలు సమర్పించిన టీటీడీ
- నేడు రాష్ట్ర ప్రభుత్వం తరపున..




శ్రీశైలం, మార్చి 4: శ్రీశైలం క్షేత్రంలో సోమవారం భ్రమరాంబ సమేత మల్లికార్జునుడు మయూర వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. ముందుగా ఉభయ దేవాలయ ప్రాంగణంలోని అక్కమహాదేవి అలంకార మండపంలో స్వామి అమ్మవార్ల ఉత్సవమూర్తులను సుగంధ పుష్పాలతో ముస్తాబు చేశారు. అనంతరం మయూర వాహనంపై అధిష్టింపజేశారు. ఆలయ అర్చకులు, వేదపండితులు అర్చనలు, ప్రత్యేక పూజలు నిర్వహించి మంగళహారతులు సమర్పించారు. తరువాత స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులను మంగళ వాయిద్యాలు, కళాకారుల సంగీత, జానపద నృత్యాల నడుమ ఆలయం రాజగోపురం నుంచి వెలుపలికి తోడ్కొని వచ్చారు. గంగాధర మండపం వద్ద ప్రత్యేక పూజాదికాలు నిర్వహించి క్షేత్ర పురవీధుల్లో గ్రామోత్సవం జరిపారు. గ్రామోత్సవం ముందు కోలాటం, చెక్కభజన, రాజభటుల వేషాలు, జాంజ్ పథక్, జానపద పగటి వేషాలు, గొరవయ్యలు, బుట్టబొమ్మల నృత్యాలు, బీరప్పడోలు, తప్పెట్లు, డ్రమ్స్, భజంత్రీలు, భంజారా నృత్యం, శంఖానాదాలు మార్మోగాయి. ఆలయ రాజగోపురం నుంచి ప్రారంభమైన గ్రామోత్సవం గంగాధర మండపం మీదుగా నంది మండపం వరకు.. తిరిగి అక్కడి నుంచి బయలు వీరభద్ర స్వామి ఆలయం దాకా కొనసాగింది.

టీటీడీ తరపున పట్టువస్త్రాల సమర్పణ..

శ్రీశైలంలో జరుగుతున్న మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా నాలుగో రోజు సోమవారం సాయంత్రం తిరుమల తిరుపతి దేవస్థానం తరపున టీటీడీ ఈవో ఏవీ ధర్మారెడ్డి స్వామి, అమ్మవార్లకు పట్టువస్త్రాలు సమర్పించారు. ముందుగా ఆలయ రాజగోపురం వద్ద పట్టువస్త్రాలతో వచ్చిన వీరికి శ్రీశైల దేవస్థానం ధర్మకర్తల మండలి అధ్యక్షులు రెడ్డివారి చక్రపాణిరెడ్డి, కార్యనిర్వహణాధికారి డి.పెద్దిరాజు, అర్చకులు, వేదపండితులు, సిబ్బంది ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అనంతరం అర్చకులు పట్టువస్త్రాలకు ప్రత్యేక పూజాదికాలు నిర్వహించారు. అనంతరం శ్రీశైల దేవస్థానం ఆలయ అధికారులు, టీటీడీ దేవస్థాన అధికారులు, అర్చకులు పట్టువస్త్రాలను తలపై పెట్టుకుని ఆలయ ప్రవేశం చేసి స్వామి, అమ్మవార్లకు సమర్పించారు. ఈ సందర్భగా టీటీడీ ఈవోను శ్రీశైల దేవస్థానంలో టీటీడీ తరపున అతిథి గృహాన్ని నిర్మించాలని కోరగా రాబోవు టీటీడీ ధర్మకర్తల మండలి సమావేశంలో ప్రతిపాదనను ప్రవేశపెడతామని తెలిపారు.



పట్టువస్త్రాలను తీసుకొస్తున్న టీటీడీ ఈవో ధర్మారెడ్డి





నేడు రావణ వాహన సేవ..

బ్రహ్మోత్సవాలో భాగంగా మంగళవారం భ్రమరాంబ మల్లికార్జున స్వామివార్లకు రావణ వాహన సేవ నిర్వహిస్తారు. గ్రామోత్సవ కార్యక్రమం చేపడతారు.

నేడు కాణిపాకం నుంచి..

కాణిపాకం వరసిద్ధి వినాయక స్వామి దేవస్థానం, సాయంత్రం రాష్ట్ర ప్రభుత్వం తరపున స్వామి, అమ్మవార్లకు పట్టువస్త్రాలు సమర్పించనున్నారు.

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

బ్రహ్మోత్సవాల సందర్భంగా దేవస్థానం ఆలయ దక్షిణ మాఢ వీధిలోని నిత్య కళారాధన వేదిక, పుష్కరిణి ప్రాంగణంలోని భ్రామరీ కళావేదిక, శివదీక్షా శిబిరాల ప్రాంగణంలో సాంస్కృతిక కార్యక్రమం నిర్వహిస్తోంది.సోమవారం సాయంత్రం సాంప్రదాయ నృత్యం, వేణుగానం, భక్తి సంగీత విభావరి, శివలీలలు పౌరాణిక నాటకం, బాలనాగమ్మ నాటకం నిర్వహించారు.

ఆస్తులు పెంచుకునేందుకే మంత్రి పదవి

- అభివృద్ధి ముసుగులో బుగ్గన దోపిడీ
- టీడీపీ నేత కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి విమర్శ



డోన్‌లో మాట్లాడుతున్న కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి

డోన్, మార్చి 4: బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి తన ఆస్తులు పెంచుకోడానికి ఆర్థిక మంత్రిని అడ్డం పెట్టుకున్నారని కేంద్ర మాజీ మంత్రి, డోన్ అసెంబ్లీ టీడీపీ అభ్యర్థి కోట్ల సూర్యపకాష్‌రెడ్డి విమర్శించారు. సోమవారం డోన్ పట్టణంలోని టీడీపీ యువనేత కోట్ల రాఘవేంద్రరెడ్డి ఆధ్వర్యంలో సాయి ఫంక్షన్ హాలులో జరిగిన టీడీపీ నాయకులు, కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. తన తండ్రి కోట్ల విజయభాస్కర్ రెడ్డి రెండు సార్లు సీఎం పదవి చేపట్టి ప్రజలకు సేవ చేశారేగాని రాజకీయాలను వ్యాపారంగా ఎన్నడూ చూడలేదని అన్నారు. ఒకసారి ఆర్థిక మంత్రి పదవి నిర్వహించిన బుగ్గనకు వేల కోట్ల ఆస్తులు ఎలా వచ్చాయని ప్రశ్నించారు. మంత్రి పదవి అడ్డం పెట్టుకొని అభివృద్ధి ముసుగులో బుగ్గన ఇష్టారాజ్యంగా దోచేశారని ఆరోపించారు. పాణ్యం సిమెంటు ఫ్యాక్టరీని కొనడానికి, ఇతర రాష్ట్రాల్లో సిమెంటు ఫ్యాక్టరీని కొనుగోలు చేయడానికి ఆయనకు వందల కోట్ల రూపాయాలు ఎక్కడి నుంచి వచ్చాయని నిలదీశారు. అభివృద్ధి అంటే బుగ్గనకు ప్రజల సొమ్మును జేబులో పెట్టుకోవడమే అని ఆరోపించారు. అభివృద్ధి చేసిఉంటే అక్రమ కేసులు ఎందుకు బనాయిస్తున్నావని మంత్రిని ప్రశ్నించారు.

ఫ్యాక్షన్‌ను ఏనాడూ ప్రోత్సహించలేదు...

డోన్ నియోజకవర్గంలో కోట్ల, కేఈ కుటుంబాలు రాజకీయంగా పోరాడాయే తప్ప ఎన్నడూ ఫ్యాక్షన్‌ను ప్రోత్సహించ లేదని అన్నారు. నియోజకవర్గంలో ఫ్యాక్షన్‌ను ఎప్పుడో నిర్మూలించి ప్రజలకు ప్రశాంత వాతావరణం కల్పించామన్నారు. తనపై ఫ్యాక్షన్ కేసులు ఉన్నట్లు నిరూపిస్తే రాజకీయాల నుంచి తప్పుకుంటానని మంత్రి బుగ్గనకు కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి సవాల్ విసిరారు. ప్రజల్లో విశ్వాసం కోల్పోయిన మంత్రి బుగ్గన సిగ్గు లేకుండా అనవసర విమర్శలు చేస్తున్నారని, ఆయనను ప్రజలు నమ్మే పరిస్థితి లేదన్నారు. గత టీడీపీ ప్రభుత్వంలోనే డోన్ నియోజకవర్గాన్ని ఎంపిక చేసి రూ.300 కోట్లు మంజూరు చేసిందని, అదంతా తాను చేసినట్లు బుగ్గన చెప్పుకోవడం విడ్డూరంగా ఉందని అన్నారు. డోన్ నియోజకవర్గంలో, ఇతర జిల్లాల్లో మైనింగ్ వ్యాపారాలను తన గుప్పిట్లో పెట్టుకుని సంపాదిస్తున్నది వాస్తవం కాదా? అని ప్రశ్నించారు. వైసీపీ సిద్ధం సభలకు రూ.150 కోట్లు ఖర్చు పెట్టి రాష్ట్రమంతటా ఉన్న జనాలను తరలిస్తూ ప్రజాధనాన్ని దుర్వినియోగం చేయడం లేదా? అని మండిపడ్డారు. కోట్ల కుటుంబానికి ప్రజల అభిమానమే ఆస్తి అని, రాబోయే ఎన్నికల్లో ప్రజల ఆశీస్సులు తనకు ఉంటాయని కోట్ల ధీమా వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శులు కోట్రికే ఫణిరాజ్, వలసల రామకృష్ణ, డీసీఎంఎస్ మాజీ చైర్మన్ లక్ష్మీరెడ్డి, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ టీఈ కేశన్నగౌడు, ఓబులాపురం శేషిరెడ్డి, మల్లి రమణ, రేగటి రామ్మోహన్ రెడ్డి, డోన్ మండల పార్టీ అధ్యక్షుడు శ్రీనివాసులు యాదవ్, ప్యాపిలి మండల పార్టీ అధ్యక్షుడు గండికోట రామసుబ్బయ్య, భాస్కర్ నాయుడు, నల్లమేకలపల్లి భాస్కర్‌రెడ్డి ఓంప్రకాష్, ఎర్రగుంట్లపల్లి రమేష్ రెడ్డి, చంద్రపల్లి ఆచారి, రంజిత్ కిరణ్, ఎస్ఎండీ రఫీ, అన్వర్‌బాషా, బాష్యం శ్రీను, కేఈ శ్యాం, ఎల్లగౌడు, గురుస్వామి యాదవ్, వలసల బాలుడు పాల్గొన్నారు.

నంద్యాలకు బయలుదేరిన ఉత్సవమూర్తులు

పెళ్లి పెద్దగా రావాలని బ్రహ్మనందీశ్వరుడికి ఆహ్వానం



నంద్యాలకు బయలు దేరిన మహానందీశ్వరుని ఉత్సవమూర్తులు

మహానంది, మార్చి 4: బ్రహ్మనందీశ్వరుడిని పెళ్లి పెద్దగా ఆహ్వానించేందుకు మహానంది క్షేత్రంలోని స్వామి అమ్మవార్ల ఉత్సవమూర్తులు సోమవారం నంద్యాలకు బయలుదేరారు. మహా శివరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా జరిగే కల్యాణానికి ఆనవాయితీ ప్రకారం నంద్యాలలోని బ్రహ్మనందీశ్వరుని ఆహ్వానిస్తారు. ఇందులోభాగంగా స్వామి అమ్మవార్ల ఉత్సవమూర్తుల విగ్రహాలు సోమవారం సాయంత్రం ప్రత్యేక వాహనంలో నంద్యాలకు బయలుదేరాయి. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణంలోని కళ్యాణ మండపంలో ఉత్సవమూర్తులను ప్రత్యేక పల్లకిపై ఆశీనులు చేశారు. వేదపండితులు, అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ప్రత్యేక వాహనంలో ఉత్సవమూర్తులు మేళతాళాలతో నంద్యాలకు బయలుదేరారు. మార్గమధ్యంలోని గ్రామాల్లో ఉత్సవమూర్తులకు ప్రజలు స్వాగతం పలికి కాయకర్పూరాలు సమర్పించారు. మంగళవారం రాత్రి తిరిగి ఉత్సవమూర్తులు మహానందికి చేరుకుంటారు. కార్యక్రమంలో ఆలయ ఈవో కాపు చంద్రశేఖరరెడ్డి, దేవస్థానం నిత్యాన్నదాన సత్రం కూరగాయల దాత లక్కబోయిన ప్రసాద్, ఏఈఓలు ఎర్రమల్ల మధు, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ఇంటర్ పరీక్షలకు 863 మంది గైర్హాజరు

కర్నూలు(ఎడ్యుకేషన్), మార్చి 4: జిల్లాలో ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం సోమవారం జరిగిన ఇంగ్లీష్ పరీక్షకు 863 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారని ఆర్ఐవో ఎస్‌వీఎస్ గురువయ్యశెట్టి తెలిపారు. జిల్లాలో మొదటి సంవత్సరం విద్యార్థులు మొత్తం 24,802 మంది నమోదు చేసుకున్నారని చెప్పారు. 23,939 మంది పరీక్షకు హాజరు కాగా, 863 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారని ఆయన తెలిపారు.

నంద్యాల జిల్లాలో 705 మంది..

నంద్యాల (నూనెపల్లె), మార్చి 4 : జిల్లాలో జరిగిన ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం పరీక్షకు 705 మంది గైర్హాజరైనట్లు డీఐఈవో సునీత సోమవారం తెలిపారు. జనరల్ విభాగంలో 13,680 మంది విద్యార్థులకుగాను 586 మంది గైర్హాజరయ్యారని ఆయన చెప్పారు. ఒకేషనల్ విభాగంలో 1374 మంది విద్యార్థులకుగాను 119 మంది గైర్హాజరయ్యారని తెలిపారు. జిల్లాలో ఎక్కడా మాల్ ప్రాక్టీస్ జరగలేదని ఆమె అన్నారు.

రీ వాల్యుయేషన్‌లో 91 శాతం ఉత్తీర్ణత!

ఒకేసారి ఇంత మంది పాస్ కావడంపై అనుమానాలు

కర్నూలు(అర్బన్), మార్చి 4: రాయలసీమ యూనివర్సిటీలో విద్యార్థుల జీవితాలతో అధికారులు చెలగాటమాడుతున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. రాయలసీమ యూనివర్సిటీకి అనుబంధంగా 43 బీఈడీ కళాశాలలు ఉండగా ఇటీవల 4వ సెమిస్టర్ రీ వాల్యుయేషన్ పరీక్షల ఫలితాలు విడుదలయ్యాయి. 847 మంది దరఖాస్తు చేసుకోగా 777 మంది 91 శాతంతో ఉత్తీర్ణత సాధించారు. 1వ సెమిస్టర్ పరీక్షలో 813 మందికి 353 మంది 45 శాతంతో ఉత్తీర్ణత సాధించడం పలు అనుమానాలకు దారి తీసింది. పరీక్షలు బాగా రాసినప్పుడు మూల్యాంకనంలో అధ్యాపకులుగా వ్యవహరించిన తీరు చర్చనీయాంశమైంది. ఒకేసారి ఇంత మందిని కక్ష గట్టి ఫెయిల్ చేశారా అని ఎస్ఎఫ్ఐ విద్యార్థి సంఘం నాయకుడు అబ్దుల్లా ప్రశ్నించారు. పైగా ఫెయిలైన విద్యార్థులు మళ్లీ ఉత్తీర్ణత సాధించడం దేనికి సంకేతమని ప్రశ్నిస్తున్నారు. దీనికి యూనివర్సిటీ అధికారులే సమాధానం చెప్పాలని విద్యార్థి సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి. పైగా ఈ పరీక్షల ఫలితాలను చూసి విద్యార్థులు, కళాశాలల యాజమాన్యాలు, యూనివర్సిటీ అధికారుల తీరుపై గగ్గోలు పెడుతున్నారు. యూనివర్సిటీలో పరీక్షల విభాగం గాడి తప్పిందని కళాశాలల యాజమాన్యాలు ఆరోపిస్తున్నాయి.

గిరిజన పాఠశాలను సందర్శించిన ఐబీ బృందం



బాలికల క్రీడల విజయాలను పరిశీలిస్తున్న బృందం

పాణ్యం, మార్చి, 4 : మండలంలోని బలపనూరు పరిధిలో గల ఏపీ గిరిజన గురుకుల బాలికల పాఠశాల (పీటీజీ- చెంచు)ను ఇంటర్నేషనల్ బాకలారెట్ బృందం సందర్శించింది. సోమవారం అమెరికాలోని వాషింగ్టన్ రాష్ట్రం ఐబీ మేనేజరు వెండిగ్రీన్, ఇంగ్లాండు ఐబీ డెవలప్‌మెంట్ ప్రత్యేక అధికారి ఎరిక్ బాబర్, డాక్టర్ గిరిబాబుయాదవ్ పాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాలలోని ఎనిమిది, తొమ్మిది తరగతుల ఆంగ్ల మాధ్యమం సైన్స్, గణితం సబ్జెక్టులలో ఐఎఫ్‌బీల విద్యాబోధనలను పరిశీలించారు. ఉపాధ్యాయుల విద్యాబోధన, ఆర్ట్ గ్యాలరీని పరిశీలించారు. క్రీడల్లో బాలికలు ప్రదర్శించిన ప్రతిభను పరిశీలించారు. ఈ సందర్భంగా బాలికలు ప్రదర్శించిన నృత్యాలలో బృందం పాల్గొని నృత్యం చేశారు. ఈ కార్యక్రమంలో ఏఎంఓ లలిత, ఎంఈఓ కోటయ్య, ప్రిన్సిపాల్ మేరి నలోమి, సీఆర్పీలు పాల్గొన్నారు.

ఎన్నికల కోడ్ లోపు ఇళ్ల స్థలాలు ఇవ్వాలి

జేసీకి వినతి పత్రం ఇచ్చిన జర్నలిస్టులు



వినతిపత్రం అందజేస్తున్న ఏపీయూడబ్ల్యూజే నాయకులు

కర్నూలు(కల్చరల్), మార్చి 4: ఎన్నికల కోడ్ వచ్చేలోపు జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని ఐజేయూ, జాతీయ సమితి సభ్యుడు కే నాగరాజు, ఏపీయూడబ్ల్యూజే జిల్లా అధ్యక్షుడు ఈఎన్ రాజు అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో జేసీ నారపురెడ్డి మౌర్యకు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ నెల 15వ తేదీలోపు ఎన్నికల కోడ్ వచ్చే అవకాశం ఉండడంతో జర్నలిస్టులు ఆందోళనకు గురవుతున్నారని అన్నారు. అధికారులు కోడ్ వచ్చేలోపు ఇళ్ల స్థలాలు పంపిణీ చేయాలని కోరారు. జాయింట్ కలెక్టర్ నారపురెడ్డి మౌర్య మాట్లాడుతూ గార్గేయపురంలో స్థలం గుర్తించామని అన్నారు. అయితే అందులో ఒకరికి మైనింగ్ కోసం లీజుకు ఇవ్వడంతో రద్దు చేయమని ఆదేశాలు జారీ చేశామని తెలిపారు. కర్నూలు ఆర్డీవో, తహసీల్దార్‌తో మాట్లాడి వెంటనే ఫైల్ పెట్టాలని డీఆర్వో, మైనింగ్ డీడీని ఆదేశించారు. మైనింగ్ లీజు రద్దు కాగానే ఇళ్ల పట్టాలు పంపిణీకి చర్యలు తీసుకుంటామని చెప్పారు. అక్రిడిటేషన్ జర్నలిస్టులందరికీ ఇంటి స్థలం అందేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో జర్నలిస్టులు సుంకన్న, అంజి, దస్తగిరి, శివరాజ్‌కుమార్, మధు, స్నేహల్, సాగర్, రఫీ, మధుసూదన్‌రెడ్డి, మోహన్, సూర్య రవి, మధు తదితరులు పాల్గొన్నారు.

జొళదరాసికి జగన్ దగా

- నాలుగేళ్లపాటు నిర్లక్ష్యానికి గురైన మినీ రిజర్వాయర్
- వివేకా హత్య కేసులో సీఎం జగన్ పాత్రపై విచారణ జరపాలి : మాజీ ఎమ్మెల్యే బీసీ

కోవెలకుంట్ల, మార్చి 4: కోవెలకుంట్ల పట్టణ సమీపంలోని కుందూ నదిపై జొళదరాసి మినీ రిజర్వాయర్‌కు శంకుస్థాపన చేసి 16 నెలల్లో పూర్తి చేస్తానని చెప్పిన సీఎం నాలుగేళ్లుగా విస్మరించి ఈ ప్రాంత ప్రజలను దగా చేశారని బనగానపల్లె మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్దన్‌రెడ్డి అన్నారు. సోమవారం కోవెలకుంట్ల పట్టణంలో బనగానపల్లె మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్దన్‌రెడ్డి బాబు ష్యూరిటీ, భవిష్యత్ గ్యారెంటీ కార్యక్రమంలో భాగంగా మేనిఫెస్టో కరపత్రాలను ఇందిరమ్మ కాలనీలో ఇంటింటికి తిరిగి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాలుగేళ్ళు పూర్తయినా జొళదరాసి మినీ రిజర్వాయర్‌కు ఒక ఇటుక కూడా పేర్చిన పాపానపోలేదని బీసీ విమర్శించారు. కుందూనది వైండింగ్ పనులు ఎక్కడికక్కడ ఆగిపోయాయన్నారు. టీడీపీ హయంలో కుందూనదిని, ఎస్సార్బీసీని పారించిన ఘనత టీడీపీకే దక్కుతుందన్నారు. రైతు సంక్షేమం గురించి జగన్ మాటలు ఊదరగొట్టడం తప్పితే అన్నదాతలకు ఒరగబెట్టిందేమి లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాజకీయ లబ్ధి కోసమే వివేకానందరెడ్డిని జగన్ ముఠానే హతమార్చిందని బీసీ అన్నారు. జగన్ సీఎం కాగానే ఈ కేసు విచారణలో పురోగతి ఎందుకు ఆగిపోయిందని బీసీ ప్రశ్నించారు. ఈ ఘటనలో జగన్ పాత్రై సమగ్ర విచారణ జరపాలని అన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ జనసేన పార్టీలకు చెందిన నాయకులు బీసీ ప్రసాద్‌రెడ్డి, గడ్డం నాగేశ్వరరెడ్డి, లాయర్ శ్రీకాంత్, గడ్డం అమర్‌నాథరెడ్డి, పెనుగొండ రాజశేఖర్, అమడాల మద్దిలేటి, మురళి, జనసేన నాయకులు మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



టీడీపీ మేనిఫెస్టో కరపత్రాలు అందజేస్తున్న బీసీ

ఆర్యవైశ్య సంఘం మహిళా అధ్యక్షురాలిగా నాగ సుప్రజ



నంద్యాల జిల్లా మహిళా విభాగం కార్యవర్గ సభ్యులుగా ప్రమాణ స్వీకారం చేస్తున్న ఆర్యవైశ్య సంఘం మహిళలు

బనగానపల్లె, మార్చి 4: జిల్లా ఆర్యవైశ్యసంఘం మహిళా నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకారం యాగంటి క్షేత్రంలో సోమవారం నిర్వహించారు. యాగంటిలోని శ్రీవాసవి అన్నదాన సత్రంలో నంద్యాల జిల్లా ఆర్యవైశ్య సంఘం మహిళా సంఘాల నూతన ప్రథమ అధ్యక్షురాలిగా గుండా నాగ సుప్రజ, జనరల్ సెక్రటరీగా నల్లగట్ల ఉమామహేశ్వరి, కోశాధికారిగా దమ్మాల లక్ష్మి, వర్కింగ్ కమిటీ అధ్యక్షురాలిగా అనుమల విజయలక్ష్మి, అదనపు కార్యదర్శిగా శ్రీలక్ష్మి, ఇతర కార్యవర్గ సభ్యులుగా పలువురు ప్రమాణ స్వీకారం గావించారు. ఆర్యవైశ్య మహాసభ గౌరవ అధ్యక్షుడు జయంతి వెంకటేశ్వర్లు, అధ్యక్షుడు చిన్న రామ సత్యనారాయణ, మహిళా విభాగం గౌరవ అధ్యక్షురాలు రాపూరి రజని తది తరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

మేలుజాతి పశువుల ఉత్పత్తికి రంగం సిద్ధం

కృత్రిమ గర్భధారణ, సరోగసి విధానాల అమలుకు శ్రీకారం

కర్నూలు(అగ్రికల్చర్), మార్చి 3: ఉమ్మడి కర్నూలు జిల్లాలో మేలుజాతి పశువులు అంతరించిపోకుండా వాటి ఉత్పత్తిని పెంచేందు కోసం పశుసంవర్ధక శాఖ సరికొత్త ప్రయోగాలకు శ్రీకారం చుట్టింది. సరోగసి (అద్దె గర్భం)తో పాటు కృత్రిమ గర్భధారణ విధానాల ద్వారా మేలుజాతి పశువుల ఉత్పత్తిని పెంచేందుకు చర్యలు తీసుకుంటున్నామని పశుసంవర్ధకశాఖ జేడీ రామచంద్రయ్య సోమవారం తెలిపారు. సరోగసి విధానంలో మేలుజాతి పశువుల ఉత్పత్తిని పెంచేందుకు రాష్ట్రంలోని గుంటూరు లాంఫామ్ పశు క్షేత్రంలోనే మేలుజాతి పశువుల వీర్యాన్ని సేకరించి పిండాలను అభివృద్ధి చేసే కార్యక్రమాన్ని చేపట్టామని, అదే విధంగా నెల్లూరు జిల్లా చింతలదీవి పరిధిలోని మేలు జాతి పశువుల వీర్యంతో పిండాలను అభివృద్ధి చేసేందుకు నిర్ణయించినట్లు రామచంద్రయ్య తెలిపారు ఈ పిండాలను ఎంపిక చేసిన నాటు పశువుల గర్భంలో ప్రవేశపెట్టడం ద్వారా మేలు జాతి దూడల అభివృద్ధి జరుగుతుందని అన్నారు. ఈ ప్రక్రియపై అవగాహన పెంచుకుని జిల్లాలో విజయవంతం చేసేందుకు కౌతాళం పశుసంవర్ధక ఆసుపత్రిలో పని చేస్తున్న డా. జగదీష్‌కు గుంటూరులోని లాంఫామ్‌లో వారం రోజుల పాటు శిక్షణ కూడా ఇప్పించామన్నారు.

మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోళ్లు

రైతులు ఈక్రాప్, ఈకేవైసీ చేయించుకోవాలి

కర్నూలు(అగ్రికల్చర్), మార్చి 4: ఉమ్మడి కర్నూలు జిల్లా రైతులకు ప్రభుత్వం ఊరట కల్పించే నిర్ణయం తీసుకుంది. వేరుశనగ, పప్పుశనగ, మినుములను మద్దతు ధరకు మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోలు చేసేందుకు ప్రభుత్వం నిర్ణయించిందని ఆ సంస్థ జిల్లా మేనేజర్ రాజు తెలిపారు. సోమవారం నగరంలోని మార్క్‌ఫెడ్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో శనగలకు క్వింటానికి మద్దతు ధర రూ.5,440, వేరుశనగలకు మద్దతు ధర రూ.6,377, మినుములకు మద్దతు ధర రూ.6,950గా కేంద్ర ప్రభుత్వం నిర్ణయించిందని తెలిపారు. ఈ పంట ఉత్పత్తులను మార్క్‌ఫెడ్ సంస్థ కేంద్రాల్లో విక్రయించడానికి ముందు ఆర్‌బీకే కేంద్రాల్లో ఈక్రాప్, ఈకేవైసీ తప్పనిసరిగా చేయించాలని జిల్లా జాయింట్ కలెక్టర్ ఆదేశించారని అన్నారు. నాణ్యతా ప్రమాణాలను అనుసరించి శనగలు, వేరుశనగ కాయలు, మినుములు కొనుగోలు చేస్తామని మేనేజర్ రాజు తెలిపారు.

ఎన్నికల వ్యయాన్ని లెక్క కట్టండి

- నిబంధనలను పటిష్టంగా అమలు పరచండి
- జేసీ రాహుల్‌కుమార్‌రెడ్డి

నంద్యాల (కల్చరల్), మార్చి 4: రానున్న సార్వత్రిక ఎన్నికల్లో పోటీ చేస్తున్న అభ్యర్థుల ఖర్చు వివరాలను పక్కాగా లెక్కకట్టి రికార్డుల్లో నమోదు చేయాలని జాయింట్ కలెక్టర్ రాహుల్‌కుమార్‌రెడ్డి ఎంసీసీ, ఫ్లయింగ్ స్క్వాడ్ టీమ్స్, స్టాటిస్టిక్ సర్వైలెన్స్ టీమ్స్ వీడియో సర్వైలెన్స్ టీమ్స్, వీడియో వ్యూవింగ్ బృంద అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని వైయస్సార్ సెంటినరీ హాలులో సాధారణ ఎన్నికలు-2024 భాగంగా ఎంసీసీటీ, వీఎస్టీ, వీవీటీ, ఎఫ్ఎస్టీ టీంలకు నిర్వహించిన శిక్షణా కార్యక్రమంలో జేసీ పాల్గొన్నారు.

తలముడి సమీపంలో రోడ్డు ప్రమాదం

- ఐదుగురికి తీవ్ర గాయాలు

నందికొట్కూరు, మార్చి 4: మిడ్తూరు మండలం తలముడి సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఐదుగురు తీవ్రగాయాలపాలయ్యారు. గడివేములకు వెళ్తున్న రెండు ఆటోలను, ఒక ద్విచక్రవాహనాన్ని నందికొట్కూరు వైపుగా వస్తున్న గుర్తుతెలియని టిప్పర్ ఢీ కొట్టింది. దీంతో రెండు ఆటోల్లో ప్రయాణిస్తున్న ముగ్గురు, ద్విచక్రవాహనంపై వెళ్తున్న ఇద్దరు మొత్తం ఐదుగురు ప్రయాణికులు తీవ్ర గాయాలపాలయ్యారు. ఈ ప్రమాదంలో ఓర్వకల్లు మండలం కొమ్మరెళ్లి గ్రామానికి చెందిన దస్తగిరి, నీలావతి, డోన్ నుంచి గడివేములకు ద్విచక్రవాహనంపై వస్తున్న మౌలానాబి, సిద్ధయ్య, గడివేముల మండలం మంచాలకట్ట గ్రామానికి చెందిన ఆటో డ్రైవర్ లక్ష్మీనారాయణ గాయపడ్డారు. వీరిని కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మిడ్తూరు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

కేసీ కాల్వలో పడిన వాహనం : నలుగురికి గాయాలు

జూపాడుబంగ్లా, మార్చి 4: శ్రీశైలం వెళ్లి తిరిగి వస్తున్న భక్తుల వాహనం కేసీ కాల్వలో పడిపోయింది. ఈ ప్రమాదంలో నలుగురికి స్వల్ప గాయాలయ్యాయి. గుంతకల్లు సమీపంలో ఓ గ్రామానికి చెందిన శివభక్తులు శ్రీశైలం క్షేత్రానికి దర్శనం చేసుకుని తిరిగి వస్తుండగా జూపాడుబంగ్లా వద్ద సోమవారం రాత్రి అదుపుతప్పి కేసీ కాల్వలో పడిపోయింది. జూపాడుబంగ్లా గ్రామస్థులు వాహనంలో ఉన్న పది మందిని రక్షించారు. వారిలో వంశి, సురేష్, ఒంటెన్నలతోపాటు మరో ఇద్దరికి స్వల్పగాయాలయ్యాయి. జూపాడుబంగ్లాలోని ప్రైవేటు వైద్యశాలలో చికిత్స చేయించుకున్నారు.

మల్లన్న సన్నిధిలో సినీ హీరో విష్వక్సేన్



శ్రీశైలం, మార్చి 4: శ్రీశైల భ్రమరాంబ మల్లికార్జున స్వామి, అమ్మవార్లను సోమవారం తెలుగు సినీనటుడు విష్వక్సేన్ చిత్ర యూనిట్‌తో కలిసి దర్శించుకున్నారు. స్వామి, అమ్మవార్ల దర్శ నానంతరం ఆయన క్షేత్ర పరిధిలోని రుద్రవనం లో మీడియాతో మాట్లాడారు. ఈ సందర్భంగా విష్వక్సేన్ నటించిన గామి సినిమా విశేషాలపై మాట్లాడారు. గామి సినిమా ఐదు సంవత్సరాల కింద వారణాసిలో ప్రాంభమైందని చిత్రంలో కొన్ని సన్నివేశాల కోసం చిత్రం ఆలస్యమైందని తెలిపారు. సోమవారం సాయంత్రం గామి సినిమాలోని శివశివ అనే పాటను విడుదల చేస్తున్న సందర్భంగా స్వామి, అమ్మవార్లను దర్శించుకోవడం ఆనందాన్ని కలిగించిందన్నారు.

ప్రజలకు ఇబ్బందులు కలిగించిన వ్యక్తికి జైలు శిక్ష

నంద్యాల క్రైం, మార్చి 4: నంద్యాల వన్‌టౌన్ పరిధిలో ఓ వ్యక్తి మద్యం సేవించి ప్రజలు, వాహనదారులకు ఆటంకం కలిగించిన కేసులో ఏడు రోజుల జైలు శిక్ష పడింది. పోలీసుల వివరాల మేరకు.. పట్టణంలోని చాంద్‌బాడ, ఫాతిమా స్కూల్ సమీపంలో సోమవారం నడిగడ్డకు చెందిన షేక్ మహబూబ్ అనే వ్యక్తి మద్యం సేవించి వాహనాలు, ప్రజలకు ఆటంకం కలిగిస్తూ మహిళల పట్ల అసభ్యకరంగా ప్రవర్తిస్తుండటంతో వన్‌టౌన్ పోలీసులు అరెస్టు చేశారు. కేసు నమోదు చేసి నంద్యాల సెకండ్‌క్లాస్ మెజిస్ట్రేట్ రాంభూపాల్‌రెడ్డి ఎదుట హాజరుపరచగా ఏడు రోజుల రిమాండ్ విధించినట్లు వన్‌టౌన్ సీఐ బి.వెంకటచలపతి తెలిపారు.

సాఫ్ట్‌వేర్ ఇంట్లో చోరీ

రూ.50 వేల నగదు, 2 తులాల బంగారం అపహరణ

నంద్యాల క్రైం, మార్చి 4: నంద్యాల పట్టణంలోని రైతునగర్‌లో సోమవారం సాఫ్ట్‌వేర్ కౌశిక్ ఇంట్లో దొంగలు పడ్డారు. బీరువా తాళాలను పగులగొట్టి అందులో ఉన్న రూ.50 వేల నగదుతోపాటు రెండు తులాల బంగారం అపహరించారు. ఈ దృశ్యాలు అక్కడి సీసీ కెమెరాలో నమోదయ్యాయి. బాధితుడు కౌశిక్ ఫిర్యాదు మేరకు నంద్యాల తాలుకా పోలీసులు కేసు నమోదు చేసుకొని దొంగల కోసం గాలిస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో రైతు మృతి

మిర్చి అమ్మేందుకు వెళుతుండగా ఘటన

పెద్దకడుబూరు మార్చి04: కర్ణాటక రాష్ట్రంలోని బళ్లారి జిల్లా సమీపంలోని రామాపురం గ్రామం వద్ద మినీ వాహనం టైరు పంక్చర్ కావడంతో జరిగిన రోడ్డు ప్రమాదంలో రోగెన్న(30) అనే రైతు అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ సంఘటన ఆదివారం అర్ధరాత్రి జరిగింది. పెద్దకడబూరు మండలానికి చెందిన ఐదుగురు రైతులు మిరప కాయలను అమ్ముకునేందుకు మినీ వాహనంలో కర్ణాటక రాష్ట్రంలోని బ్యాడిగి పట్టణానికి బయలుదేరారు. ఆదివారం అర్ధరాత్రి బళ్లారి జిల్లా సమీపంలోని రామాపురం గ్రామం వద్ద వాహనం టైరు పంక్చర్ అయి బోల్తా పడడంతో రైతు రోగెన అక్కడిక్కడే మృతి చెందాడు. మిగతా నలుగురు రైతులు స్వల్పగాయాలతో బయటపడ్డారు. వారిని బళ్లారి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుడుకి భార్య జయమ్మ, ఒక కుమార్తె ఉన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి: ఎస్పీ

నంద్యాల క్రైం, మార్చి 4 : సైబర్ నేరాలపట్ల అన్ని వర్గాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ కె.రఘువీర్‌రెడ్డి సూచించారు. సోమవారం ఆయన మాట్లాడుతూ తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభాలు ఆర్జించవచ్చంటూ వాట్సాప్‌లో, టెలిగ్రామ్ యాప్‌ల ద్వారా పంపే లింక్‌లను ఎలాంటి పరిస్థితుల్లోనూ ఓపెన్ చేయవద్దన్నారు. తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభాలు ఇస్తామంటూ ప్రజలను ఆకర్షించి కోట్లలో దోచుకుంటున్నారని, వర్చువల్ అకౌంట్స్‌తో మాయ చేస్తూ లక్షల్లో నకిలీ సైట్‌లో ఇన్వెస్ట్ చేయించి మోసం చేసే సైబర్ నేరగాళ్ల ఉచ్చులో పడి మోసపోవద్దన్నారు. ఏదైనా ఇబ్బందుల్లో పడితే సైబర్ హెల్ప్‌లైన్ నెంబర్ 1930కి కాల్‌చేసి సమాచారం అందించాలని కోరారు.

స్పందన అర్జీలు పరిష్కరించాలి: ఎస్ఈ



అర్జీలు స్వీకరిస్తున్న ఎస్ఈ డీ వేణుగోపాల్

కర్నూలు(న్యూసిటీ), మార్చి 4: స్పందన కార్యక్రమానికి వచ్చే అర్జీలను త్వరగా పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని ఎస్ఈ డీ.వేణుగోపాల్ అధికారులను ఆదేశించారు. సోమవారం నగరపాలక సంస్థ కార్యాలయంలోని పాత కౌన్సిల్ హాలులో నిర్వహించిన స్పందనలో లబ్ధిదారుల నుంచి వచ్చిన వినతులను ఆయన స్వీకరించారు. కార్యక్రమంలో హెల్త్ ఆఫీసర్ విశ్వేశ్వర్ రెడ్డి, మేనేజరు చిన్న రాముడు, అసిస్టెంట్ సిటీ ప్లానర్ శశికళ, సెక్రటరీ నాగ రాజు, వివిధ విభాగాధిపతులు, నగరపాలక ఉద్యోగులు పాల్గొన్నారు.

● మున్సిపల్ అల్ట్రా నెట్ క్లాప్ డ్రైవర్లకు సూపర్‌వైజర్లకు పెండింగ్ జీతాలు ఇవ్వాలని సీఐటీయూ నగర కార్యదర్శి రామాంజనేయులు స్పందనలో అధికారులకు వినతి పత్రం అందజేశారు. కార్మికులకు జీతాలు రాకపోవడంతో కుటుంబాలు పోషించుకోవడం కష్టంగా ఉందన్నారు. కార్యక్రమంలో డ్రైవర్లు, సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

● ఇందిరాగాంధీ నగర్‌లో సీసీ రోడ్డును నిర్మించాలని సీపీఐ నగర కార్యదర్శి టి.రాముడు స్పందనలో ఫిర్యాదు చేశారు. గత మూడు నెలల కింద రోడ్డును తవ్వేసి వదిలేడయంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని అధికారులకు వివరించారు. బీ.క్యాంపు పంపింగ్ లైన్ ఇల్లూరు నగర్‌లో పగిలి పోవడంతో మున్సిపల్ అధికారులు సీసీ రోడ్లను ఎక్స్‌కవేటర్లతో తవ్వి మధ్యలో పైప్‌లైన్ వేశారని అన్నారు. ఇటీవల వృద్ధులతోపాటు ఒక వలంటీరు కిందిపడి చేయి కూడా విరిగిందని అన్నారు. తక్షణమే ఇందిరాగాంధీ నగర్‌లో సీసీ రోడ్డు నిర్మించాలని కోరారు. కార్యక్రమంలో ఎం.లోకేష్, ఎం.భాస్కర్, రోశయ్య, మద్ది లేటి తదితరులు పాల్గొన్నారు.

పోలీసు స్పందనకు 77 ఫిర్యాదులు

కర్నూలు, మార్చి 4: స్థానిక జిల్లా ఎస్పీ క్యాంపు కార్యాలయంలో ఎస్పీ జి.కృష్ణకాంత్ సోమవారం స్పందన కార్యక్రమాన్ని నిర్వహించగా, బాధితుల నుంచి 77 ఫిర్యాదులు వచ్చాయి.

● ఫేస్‌బుక్ చూస్తుంటే.. రవికుమార్ అనే పేరుతో ఉన్న ఫేస్‌బుక్ ఖాతా నుంచి మిలాన్ డే గురించి లింక్ పంపాడు. ఆ లింక్‌ను లైక్ చేసి క్లిక్ చేశాం.. నాకు ఫోన్ చేసి వాట్సాప్‌కు హాయ్ అని చెప్పాడు. రూ.550 మెంబరుషిప్ చలానా చార్జీలు అని, డబ్బులు వేస్తే లక్కీడ్రా వస్తుందని రూ.2వేలు వేయించుకున్నాడు. లక్కీ డ్రా కింద మొత్తం రూ.2.5 లక్షలు వచ్చాయని చెప్పి 10శాతం కమిషన్ కింద రూ.20వేలు కట్టించుకున్నాడు. నా బ్యాంకు ఖాతాకు మొత్తం వేస్తామని చెప్పి.. కొత్త బ్యాంకు ఖాతా అని యుపీఐడీ పని చేయ లేదని సర్వర్ బీజీ వస్తుందని, సర్వీసు చార్జీలు అని వివిధ కారణాలతో రూ.70వేలు నసీర్ అనే పేరుగల ఫోన్‌పేకు వేయించుకుని తెలియని వ్యక్తులు మోసం చేశారని వెల్దుర్తి మండలం రామళ్లకోట గ్రామానికి చెందిన ఖలీల్ బాషా ఫిర్యాదు చేశారు.

● సాఫ్ట్‌వేర్ ఉద్యోగం ఇప్పిస్తామని చెప్పి హైదరాబాదు ఐటీసీ ఇన్‌ఫోటెక్ పేరుతో ఫేక్ కాల్ లెటరు ఇచ్చి రూ.2.85 లక్షలు తీసుకుని కర్నూలుకు చెందిన సాయికిరణ్ మోసం చేశారని, డబ్బులు తిరిగి ఇవ్వకుండా దుర్భాషలాడుతున్నాడని కర్నూలు ముజఫర్‌నగర్‌కు చెందిన సంతోష్‌కుమార్ ఫిర్యాదు చేశారు.

స్పందనలో స్వీకరించిన ఫిర్యాదులను త్వరగా పరిష్కరిస్తామని ఎస్పీ తెలిపారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ అడ్మిన్ నాగరాజు, లీగల్ అడ్వైజర్ మల్లికార్జునరావు సీఐలు పాల్గొన్నారు.

మాంటిస్సోరి విద్యార్థుల ప్రతిభ



కరాటే బెల్టులు సాధించిన మాంటిస్సోరి విద్యార్థులు

కర్నూలు(ఎడ్యుకేషన్), మార్చి 4: నగరంలోని విద్యానగర్ మాంటిస్సోరి పాఠశాల విద్యార్థులు కరాటేలో సత్తా చాటారు. స్థానిక పెద్దమార్కెట్ బాలికల పాఠశాలలో జరిగిన యూనివర్సల్ కరాటే మార్షల్ ఆర్ట్స్ బెల్టు గ్రేడింగ్ పరీక్షకు విద్యానగర్ మాంటిస్సోరి పాఠశాల విద్యార్థులు కరాటే బెల్టులు సాధించినట్లు ప్రిన్సిపాల్ స్వర్ణలత సోమవారం తెలిపారు. కరాటే బెల్టులు సాధించిన విద్యార్థులను ఆమె అభినందించారు.

మృతుడి కుటుంబానికి ఆర్థిక సాయం



ఆర్థిక సాయం అందజేస్తున్న డాక్టర్ నాగేశ్వరయ్య

కర్నూలు(హాస్పిటల్), మార్చి 4: స్థానిక గాయత్రీ ఎస్టేట్‌లోని జీఎస్ఆర్ హాస్పిటల్‌లో అకౌంటెంట్‌గా పనిచేస్తున్న సుధీర్ అనారోగ్యంతో గత నెల 25న మృతి చెందాడు. సుధీర్ నిరుపేద కావడంతో ఆ కుటుంబానికి జీఎస్ఆర్ హాస్పిటల్ మేనేజింగ్ డైరెక్టర్ జి.నాగేశ్వరయ్య ఆర్థిక సాయం అందజేశారు. సుధీర్ ఇంటికి వెళ్లి రూ.20వేల ఆర్థిక సాయం అందించారు. హాస్పిటల్ తరపున మరో రూ.50వేలు సాయం చేశారు. కార్యక్రమంలో హాస్పిటల్ వైద్యులు మహేష్ నాయుడు, వీరేష్ కుమార్, రఘుప్రవీణ్, మునిస్వామి, కళా సౌందర్య, రామచంద్ర పాల్గొన్నారు.

ప్రజల దాహం తీర్చేందుకే తాగునీరు సరఫరా

ఓర్వకల్లు, మార్చి 4: వేసవిలో ప్రజల దాహార్తిని తీర్చేందుకే ఉచిత తాగునీటి సరఫరా చేస్తున్నామని మాజీ ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి, టీడీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు మల్లెల రాజశేఖర్ అన్నారు. సోమవారం మండలంలోని హుశేనాపురం గ్రామంలో గౌరు దంపతులు, మల్లెల రాజశేఖర్ ఆధ్వర్యంలో గ్రామ టీడీపీ మైనార్టీ నాయకుడు ఎస్.మహబూబ్‌బాషా ఆధ్వర్యంలో ట్రాక్టరు ద్వారా ఉచిత తాగునీరు సరఫరా చేశారు. ఉచిత వాటర్ ట్యాంకును గౌరు చరిత, మల్లెల రాజశేఖర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వేసవిలో ఎండలు అధికమై భూగర్భ జలాలు అడుగంటి పోవడంతో బోర్లల్లో నీరు లేక ప్రజలు తాగునీటికి ఇబ్బందులు పడుతున్నారన్నారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ షమీనా, నాయకులు అన్వర్‌బాషా, కేవీ మధు, రాము, వడ్డె నారాయణ, కాటినేని నారాయణ, వేణు, జయక్రిష్ణ, రవికుమార్ పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరిక

కర్నూలు(అర్బన్), మార్చి 4: రాయలసీమ మాదిగ దండోరా వ్యవస్థాపక అధ్యక్షుడు అనంత రత్నం కాంగ్రెస్ పార్టీలో చేరారు. సోమవారం జిల్లా అధ్య క్షుడు కే.బాబురావు పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా డీసీసీ మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో దేశం, రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అత్యధిక స్థానాల్లో గెలుస్తుందన్నారు. అనంత రత్నం మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ గెలుపు కోసం కృషి చేస్తానని అన్నారు. కార్యక్రమంలో ఎస్సీ చైర్మన్ లాజరస్, సత్యనారాయణ గుప్త పాల్గొన్నారు.

నగరాభివృద్ధి కోసం ఆరు గ్యారంటీలు

మౌర్యాఇన్‌లో మేనిఫెస్టో విడుదల



మేనిఫెస్టో విడుదల చేస్తున్న టీజీ భరత్

కర్నూలు(అర్బన్), మార్చి 4: కర్నూలు నగరాన్ని ఆరు గ్యారంటీలతో అభివృద్ధి చేసేందుకు మేనిఫెస్టో రూపొందించినట్లు టీజీ భరత్ తెలిపారు. సోమవారం నగరంలోని మౌర్యాఇన్‌లో 6 గ్యారంటీల కరపత్రాన్ని ఆయన ఆవిష్కరించి మేనిఫెస్టోను విడుదల చేశారు. అనంతరం కార్యకర్తలు, నాయకులనుద్దేశించి మాట్లాడారు. ప్రజలతో మమేకమై వారి సమస్యలు తెలుసుకుని ప్రత్యేకంగా ఈ మ్యానిఫెస్టోను తయారు చేశానన్నారు. కర్నూలు నగరాన్ని స్మార్ట్ సిటీ చేయడం, కొత్త పరిశ్రమలు తీసుకు రావడం, మహిళలకు భద్రత, ఆర్థిక భరోసా, ప్రతి ఇంటికి సంక్షేమం, అందరికీ ఆరోగ్యం బాగుండాలి అందులో కర్నూలు ముందు ఉండాలి, కర్నూలుకు రాష్ట్ర హైకోర్టు బెంచ్ పేరుతో ఆరు గ్యారెంటీలను ఆయన ప్రకటించారు. ఇవే తనకు భగవద్గీత, బైబిల్, ఖురాన్‌తో సమానమన్నారు. తెలుగుదేశం పార్టీ సూపర్ 6 పతకాలతోపాటు తన ఆరు గ్యారెంటీలను అమలు చేస్తానని చెప్పారు. పార్టీ శ్రేణులంతా రానున్న 45 రోజుల పాటు వీటిని విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలని ఆయన కోరారు. కార్యక్రమంలో టీడీపీ నగర అధ్యక్షుడు నాగరాజు యాదవ్, పరిశీలకులు శ్రీనివాసమూర్తి, జనసేన ఇన్‌చార్జి ఆర్షద్, కార్పొరేటర్లు పరమేష్, జికియా అక్సారీ, అబ్బాస్, సంజీవలక్ష్మి, ముంతాజ్, శివరాజ్, రామాంజనేయులు, రాజ్యలక్ష్మి, మారుతీశర్మ బొల్లెద్దుల రామకృష్ణ, గున్నామార్క్, తిమ్మోజీ పాల్గొన్నారు.

42వ వార్డులో టీజీ భరత్ భరోసా యాత్ర: నగరంలోని 42 వవార్డు పరిధిలోని రాజీవ్ నగర్, బాబా బృందావన్ నగర్, వాణిజ్య నగర్‌లలో సోమవారం టీడీపీ కర్నూలు అభ్యర్థి టీజీ భరత్ చేపట్టారు. ఇంటింటికీ వెళ్లి కర్నూలు అభివృద్ధి కోసం ఆయన రూపొందించిన ఆరు గ్యారంటీల కరపత్రాలను అందజేశారు. వచ్చే ఎన్నికల్లో టీడీపీ గెలుపునకు అందరూ కృషి చేయా లని కోరారు. కార్యక్రమంలో వలీ, హరి, జూటూరు నరేష్, తిమ్మారెడ్డి, చంద్ర శేఖర్, రంజీత్, సత్యారెడ్డి, రామకృష్ణ, ఉమా, మాధవి, సాహిద్, అయ్యన్న, షేక్, హాజ్ మున్నీసా, షాషావలి, సురేఖా, లక్ష్మీదేవి పాల్గొన్నారు.



భరత్‌ను సన్మానిస్తున్న నాయకులు

జగన్‌ను ఇంటికి పంపేందుకు సిద్ధం : గౌరు చరిత



టీడీపీ మేనిఫెస్టో కరపత్రాలు పంపిణీ చేస్తున్న గౌరు చరిత

ఓర్వకల్లు, మార్చి 4: ప్రజలను మోసగించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డిని ఇంటికి పంపేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని మాజీ ఎమ్మెల్యే గౌరు చరిత అన్నారు. సోమవారం ఓర్వకల్లులోని పెండేకంటి నగర్, శేషసైనారెడ్డి నగర్‌లలో బాబు ష్యూరిటీ-భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈకార్యక్రమంలో టీడీపీ నందికొట్కూరు ఇన్‌చార్జి గౌరు వెంకటరెడ్డి, నంద్యాల టీడీపీ అధ్యక్షుడు మల్లెల రాజశేఖర్‌లు హాజరయ్యారు. ఈసందర్భంగా వారు ఇంటింటికీ వెళ్లి టీడీపీ కరపత్రాలు పంపిణీ చేస్తూ వైసీపీ వైఫల్యాలను ప్రజలకు వివరించారు. టీడీపీ అధికారంలోకి వచ్చాక చేపట్టబోయే అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. చంద్ర బాబు అధికారంలో ఉన్నప్పుడు అన్ని కులాల వారికి మేలు జరిగిందన్నారు. సంక్రాంతి, క్రిస్మస్, రంజాన్ తోఫా వంటి పథకాలతో వారి కుటుంబాల్లో ఆనందంగా పండుగ జరుపుకునేవారన్నారు. కార్యక్రమంలో టీడీపీ మండల కన్వీనర్ గోవిందరెడ్డి, నాయకులు మోహన్ రెడ్డి, లక్ష్మీకాంతరెడ్డి, చదువుల సుధాకర్ రెడ్డి, విశ్వేశ్వరరెడ్డి, బ్రాహ్మణపల్లి నాగిరెడ్డి, వెంకటరమణ, జీకే సుధాకర్, సుధాకర్‌రావు, గోపాల్ రెడ్డి, స్వామిరెడ్డి, వేణుగోపాల్ రెడ్డి, అల్లాబాబు, అబ్దుల్లా, యేసేపు, ఆలం బాషా, నాగరాజు, శ్రీరాములు పాల్గొన్నారు.

టీడీపీ అధికారంలోకి రావడం ఖాయం



కరపత్రాలు అందజేస్తున్న దస్తగిరి

కర్నూలు(రూరల్), మార్చి 4: రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో టీడీపీ గెలిచి అధికారంలోకి రావడం ఖాయమని కోడుమూరు టీడీపీ అభ్యర్థి బొగ్గుల దస్తగిరి అన్నారు. కర్నూలు రూరల్ మండలం ఆర్కే దుద్యాల గ్రామంలో సోమవారం సాయంత్రం స్థానిక సర్పంచు బోయ వెంకట్రాముడు, పార్టీ కార్యకర్తలతో కలిసి బొగ్గుల దస్తగిరి పర్యటించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ఎన్నికల్లో వైసీపీకి ఓటు వేసి మరోసారి మోస పోవద్దంటు ప్రజలకు సూచించారు. కార్యక్రమంలో ఉపసర్పంచు రూతమ్మ, కొంతలపాడు సర్పంచు మహానంది, తొలిశాపురం సర్పంచు గిడ్డయ్య, బి.తాండ్రపాడు ఎంపీటీసీ మద్దిలేటి, పెద్దమ హేశ్వరరెడ్డి, ఏసన్న, ఈశ్వరయ్య, సవారి, సుధాకర్, లక్ష్మీనాయుడు, ప్రతాప్, దాను, జనసేన నాయకులు పాల్గొన్నారు.

మహా శివరాత్రికి ఆర్టీసీ ప్రత్యేక బస్సులు

కర్నూలు(రూరల్), మార్చి 4: మహాశివరాత్రి పర్వదినం పురస్కరించుకొని కర్నూలు ఆర్టీసీ భక్తుల సౌకర్యార్థం కోసం ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేసినట్లు జిల్లా ప్రజా రవాణా అధికారి టి.శ్రీనివాసులు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 7 నుంచి 9వ తేదీ వరకు అన్ని డిపోల నుంచి 310 బస్సులు నడపనున్నట్లు వివరించారు. కాలినడకన శ్రీశైలం వెళ్లే భక్తులుకు కర్నూలు-వెంకటాపురం మధ్య బస్సులను ఇప్పటికే తిప్పుతున్నామని, అందుకు ఒక్కొక్కరికి చార్జీ రూ.150లు నిర్ణయించామన్నారు. రద్దీకి అనుగణంగా మరి న్ని బస్సులను నడుపుతామని వివరించారు. కర్నూలు, పత్తికొండ, ఆదోని, ఎమ్మిగనూరు నుంచి శ్రీశైలం వరకు బస్సులను నేరుగా తిప్పుతున్నట్లు చెప్పారు. కర్నూలు నుంచి జగన్నాథగట్టు, ఎమ్మిగనూరు-గురజాల, వంటి క్షేత్రాలకు సర్వీసులను కేటాయించామన్నారు.

వ్యసనాలకు దూరంగా ఉండాలి

కర్నూలు(కల్చరల్), మార్చి 4: వ్యసనాలకు దూరంగా ఉంటే సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటారని గ్యాస్ట్రో ఎంటరాలజిస్టు డాక్టర్ శంకర శర్మ అన్నారు. సోమవారం నగరంలోని చదువుల రామయ్యనగర్‌లో, చంద్ర రాజేశ్వరరావు సేవా సమితి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఆరోగ్య అవగాహన కార్యక్రమంలో డాక్టర్ శంక రశర్మ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా వివిధ వ్యాధుల పట్ల అయన అవగాహన కల్పించారు. కార్యక్ర మంలో సీపీఐ నాయకులు కే జగన్నాథం, రామకృష్ణారెడ్డి, నాగరాజు పాల్గొన్నారు.

అర్హులందరికీ ఇంటి స్థలాలు ఇవ్వాలి



తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

ఓర్వకల్లు, మార్చి 4: అర్హులైన పేదలందరికీ రెండో విడత కింద జగనన్న ఇంటి స్థలాలు ఇవ్వాలని సోమవారం స్పందనలో తహసీల్దార్ నటరాజ్‌కు టీడీపీ నాయకుడు నాగన్న వినతిపత్రం సమర్పించారు. ఈసందర్భంగా నాగన్న మాట్లాడుతూ మండలంలో గ్రామాల్లోని లబ్ధిదారులు ఇంటి స్థలాల కోసం దరఖాస్తు చేసుకున్నారని, వారికి తక్షణమే ఇంటి స్థలాలు ఇవ్వాలని కోరారు. అలాగే ఉపాధి హామీ పనులను వారు పరిశీలించారు. 8 వారాలుగా ఉపాధి పెండింగ్ బిల్లులు ఉన్నాయని, తక్షణమే డబ్బులు ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో సంఘం నాయకులు మాసూంబాషా, రవికుమార్, వ్యవసాయ కూలీలు పాల్గొన్నారు.

ప్రైవేటు పాఠశాలల్లో ఉచిత విద్యకు దరఖాస్తులు

కర్నూలు(ఎడ్యుకేషన్), మార్చి 4: 2024-25 విద్యాసంవత్సరానికి గాను జిల్లాలోని అన్ని ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలల్లో 1వ తరగతిలో ప్రవేశాల కోసం అనాథలు, హెచ్ఐవీ బాధితులు, విభిన్న ప్రతిభావంతులు, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, ఓసీ వర్గాల పిల్లలకు 25 శాతం కింద ప్రవేశాల కోసం దరఖాస్తులను స్వీకరిస్తున్నట్లు డీఈవో సామ్యూయేల్ సోమవారం తెలిపారు. ఈ నెల 5 నుంచి 25వ తేదీ వరకు పిల్లల తల్లిదండ్రులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఆన్‌లైన్‌లో విద్యార్థులను లాటరీ విధానం ద్వారా సీట్ల కేటాయింపు జరుగుతుందన్నారు. ఎంపికైన విద్యార్థుల జాబితాను సంబంధిత పాఠశాలలో పరిశీలించుకోవచ్చన్నారు. జనన ధృవీకరణ పత్రంతో పాటు పిల్లల తల్లిదండ్రుల ఆధార్‌కార్డు, ఓటరు కార్డు, రేషన్ కార్డు, కరెంటు బిల్లులు ఏదో ఒకటి సమర్పించాల్సి ఉంటుందన్నారు.

దేవెళ్ల వసంత సాయినాథ శర్మకు సత్కారం

కర్నూలు(కల్చరల్), మార్చి 4: కర్నూలుకు చెందిన జ్యోతిష్య శాస్త్ర పండితుడు దేవెళ్ల వసంత సాయినాథ శర్మకు 'జ్యోతిష్య వైభవ ప్రపూర్ణ' బిరుదు ప్రదానం చేశారు. ఆదివారం రాత్రి హైదరాబాదులోని సీవీ రామన్ అకాడమీ సంస్థ తమ 28వ వార్షికోత్సవ వేడుకల్లో భాగంగా ఉమ్మడి తెలుగు రాష్ట్రాలలోని వేద పండితులు, జ్యోతిష్యశాస్త్ర పండితులను ఎంపిక చేసి ఘనం గా సత్కరించారు. కాగా జిల్లా నుంచి వసంత సాయినాథ శర్మను నిర్వాహక సంస్థ ఎంపిక చేశారు. హైదరాబాదులోని హరిహర కళాభవన్‌లో జరిగిన ఈ వేడుకలో సీవీ రామన్ అకాడమీ, రుద్రాక్ష వైభవం ఆధ్యాత్మిక పీఠం సం యుక్తంగా వసంత సాయినాథ శర్మకు స్వర్ణ కంకణం ప్రదానంతోపాటూ బం గారు పతకాన్ని అందజేశారు. కార్యక్రమంలో సినీ నటుడు డాక్టర్ కాదంబరి కిరణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతో మానసిక ఉల్లాసం

కర్నూలు(స్పోర్ట్స్), మార్చి 4: విద్యార్థులకు క్రీడలతో మానసిక ఉల్లాసం కలుగుతుందని సెయింట్ జోసెఫ్ పాఠశాల ప్రిన్సిపాల్ ఐశ్వర్యరెడ్డి అన్నారు. డిగ్రీ కళాశాల క్రీడా మైదానంలో సిస్టర్ స్టాన్సిలాస్ పాఠశాల ప్రైమరీ విద్యార్థు లకు స్పోర్ట్స్ మీట్ జరిగింది. ముఖ్యఅతిథిగా ప్రిన్సిపాల్ హాజరై మాట్లాడుతూ చిన్నారులకు సెల్‌ఫోన్‌కు దూరంగా ఉండాలన్నారు. చిన్నారులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. చిన్నారులు క్రీడాజ్యోతిని ప్రదర్శిం చారు. కార్యక్రమంలో సిస్టర్ స్టాన్సిలాస్ పాఠశాల హెచ్ఎం మాలవిక, కోఆర్డి నేటర్ డెబోరా, ఉపాధ్యాయులు, పీఈటీలు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

జగన్ ప్రభుత్వాన్ని ప్రజలే రద్దు చేస్తారు



ధర్నా చేస్తున్న పట్టణ పౌర సంక్షేమ సంఘం నాయకులు

కర్నూలు(కలెక్టరేట్), మార్చి 4: నగరంలో వివిధ వాహనాలపై సెన్సార్ కెమెరాలతో వేసిన జరిమానాలు రూ.1,50,000లను రద్దు చేయకపోతే జగన్ ప్రభుత్వాన్ని ప్రజలే రద్దు చేస్తారని పట్టణ పౌర సంక్షేమసంఘం నాయకుడు అన్నారు. సోమవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా పీపీఎస్ఎస్ రాష్ట్ర కమిటీ సభ్యులు పుల్లారెడ్డి మాట్లాడుతూ సెన్సార్ కెమెరా లతో వేసిన జరిమానాలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఫిట్నెస్ సర్టిఫికెట్లు జారీని ప్రైవేటు ఏజెన్సీలకు ఇవ్వరాదని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నౌషాద్, హరిక్రిష్ణవర్మ, శ్రీనివాసరెడ్డి, శ్రీనివాసులు, శ్రీకాంత్ పాల్గొన్నారు.

పనులు త్వరగా పూర్తి చేయాలి: కమిషనర్



ఇంజనీరింగ్ అధికారులతో చర్చిస్తున్న కమిషనర్

కర్నూలు(న్యూసిటీ), మార్చి 4: నగరంలో రోడ్డు వెడల్పు నిర్మాణ పనులను త్వరగా పూర్తి చేయాలని కమిషనర్ ఏ.భార్గవతేజ అధికారులను ఆదేశించారు. సోమవారం ప్రతిపాది జంక్షన్ డెవపల్‌మెంట్ సైట్స్, బళ్లారి చౌరస్తా, నాగేంద్రనగర్ వై.జంక్షన్ రోడ్లును ఇంజనీరింగ్ అధికారులతో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నేషనల్ క్లీన్ ఎయిర్ ప్రోగ్రాంలో భాగంగా నగరంలో ట్రాఫిక్‌ను నియంత్రించేందుకు కొన్ని ప్రదాన కూడళ్లను ప్రతిపాదించుకున్నామన్నారు. దానికి అనుగుణంగా రోడ్ల వెడల్పు, కూడళ్ల అభివృద్ధి చేపడుతున్నామన్నారు. ఆయన వెంట ఈఈ షాకీర్ హుస్సేన్, డీఈఈ నరేష్, ఏఈ దినేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు అవగాహన కల్పించాలి: ఆస్తి పన్నుపై అపరాధ రుసుం మాఫీ గురించి ప్రజలకు అవగాహన కల్పించాలని నగర పాలక సంస్థ కమిషనర్ భార్గవతేజ అన్నారు. సోమవారం ఎస్‌బీఐ కాలనీలోని నూతన కౌన్సిల్ హాలు లో రెవెన్యూ ఇన్స్‌పెక్టర్లు, సచివాలయ అడ్మిన్‌లతో ఆస్తిపన్ను, ఖాళీ స్థలం ప న్ను బకాయిల వసూళ్లపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భం గా కమిషనర్ మాట్లాడుతూ ప్రజలు అపరాధ రుసుం మాఫీని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో అడిషనల్ కమిషనర్ పీవీ రామలింగేశ్వర్, రెవెన్యూ ఆఫీసర్ కేఎండీ జునైద్, ఆర్ఐలు సొహైల్, వాజిద్, మన్సూర్, ఖలీల్, సాధిక్, రాజు పాల్గొన్నారు.

సప్లిమెంటరీ పరీక్షలు నిర్వహించాలి



ఆర్‌యూ రిజిస్ట్రార్‌కు వినతిపత్రం ఇస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

కర్నూలు(అర్బన్), మార్చి 4: డిగ్రీ 2015 నుంచి 2021 వరకు సెమిస్టర్‌లో మిగిలిన పరీక్షలకు మెగా సప్లిమెంటరీ నిర్వహించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రంగప్ప, అబ్దుల్లా సంయుక్తంగా డిమాండ్ చేశారు. సోమవారం రాయలసీమ యూనివర్సిటీ రిజిస్ట్రార్ అంకన్నను వినతి పత్రం అందజేశారు.

శివరాత్రి ఏర్పాట్ల పరిశీలన

ఓర్వకల్లు, మార్చి 4: బుగ్గ రామేశ్వరస్వామి మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల ఏర్పాట్లను ట్రైనీ డీఎస్పీ భావన పరిశీలించారు. సోమవారం మండలంలోని కాల్వబుగ్గ రామేశ్వరస్వామి ఆలయంలో ఈ నెల 8వ తేదీ నుంచి 13వ వరకు జరిగే బ్రహ్మోత్సవాల ఏర్పాట్లను ట్రైనీ డీఎస్పీతో పాటు సీఐ కిరణ్ కుమార్ రెడ్డి, తహసీల్దార్ నటరాజ్ ఎంపీడీవో మల్లేశ్వరి, ఎస్ఐ రాజారెడ్డి, పరిశీలించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ భక్తులకు కనీస వసతులైన తాగునీరు, ఔట్‌పోస్టు, పార్కింగ్, వైద్యశిబిరాలు, క్యూలైన్ ఏర్పాటు చేయాలని, అలాగే ప్రయాణికులకు ఇబ్బందులు లేకుండా ప్రత్యేక బస్సులు నడిపేందుకు చర్యలు తీసుకోవాలని అన్నారు. వీరి వెంట ఆలయ ఈవో డీఆర్‌కేవీ ప్రసాద్, ప్రధాన అర్చకులు కల్లె లక్ష్మీనారాయణశర్మ, లక్ష్మీనరసింహాశర్మ, నాయకులు నాగతిరుపాలు, వెంగన్న, కమిటీ సభ్యులు ఉన్నారు.

'అనియత విద్య ఉపాధ్యాయులకు న్యాయం చేయండి'

కర్నూలు(కల్చరల్), మార్చి 4: అనియత విద్య పథకం కింద గతంలో పనిచేసిన ఉపాధ్యాయులకు న్యాయం జరిగేలా చూడాలని నాన్ ఫార్మల్ ఎడ్యుకేషన్ సూపర్‌వైజర్లు, ఇన్‌స్ట్రక్టర్ల సంఘం నాయకులు ఏసీహెచ్ వెంకటేశ్వర్లు, జి. శేఖర్‌గౌడ్, ఎన్ సంజీవరావు తదితరులు విజ్ఞప్తి చేశారు. సోమవారం కలెక్టరేట్‌లోని అనియత జిల్లా సమగ్ర శిక్షణాధికారి విజయజ్యోతికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 1975లో నాటి రాష్ట్ర ప్రభుత్వం అనియత విద్య పథకం ప్రవేశం పెట్టిందని, బడిఈడు పిల్లలను బడిలో చేర్పించి చదువు చెప్పేందుకు, రాత్రి బడుల నిర్వహణకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిరుద్యోగులను ఇన్‌స్ట్రక్టర్లుగా, సూపర్‌వైజర్లుగా నియమించిందని తెలిపారు. నాయకులు బాల ఆంజనేయులు, క్రిష్ణయ్య, ఆనందరావు, సోమన్న, శేఖర్ పాల్గొన్నారు.

సెబ్ పోలీసుల దాడులు



సెబ్ పోలీసులు పట్టుకున్న ఇసుక ట్రాక్టర్

కోడుమూరు(రూరల్), మార్చి 4: మండలంలోని వర్కూరు వద్ద హంద్రీనది నుంచి అర్ధరాత్రి ఇసుక తరలిస్తున్న రెండు ఇసుక ట్రాక్టర్లను పట్టుకున్నట్లు సెబ్ సీఐ రామాంజనేయులు తెలిపారు. వర్కూరుకు చెందిన తుమ్మిళ్ల రాముడు, సతార్ల సుంకన్న అనే ఇద్దరు వ్యక్తులు కల్లపరి గ్రామానికి ఇసుక తరలిస్తుండగా దాడి చేసి పట్టుకున్నామన్నారు. ఒక్కో ట్రాక్టరుపై రూ 10 వేలు జరిమానా విధించినట్లు తెలిపారు. అలాగే స్టేషన్ పరిధిలోని కర్ర కుంట గ్రామ శివారులో నాటుసారా కేంద్రంపై దాడి చేసి 600 లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేయడంతో పాటు 10 లీటర్ల నాటుసారా సీజ్ చేసినట్లు సీఐ తెలిపారు. నిందితుడు బోయ చిన్నశివన్నను అరెస్టు చేసి రిమాండ్ తరలించినట్లు తెలిపారు.

ఆక్రమణదారుల నుంచి స్థలాన్ని కాపాడాలి



మాట్లాడుతున్న షాబీర్ బాషా

కర్నూలు(ఎడ్యుకేషన్), మార్చి 4: స్థానిక మెడికల్ కళాశాలలోని క్రీడా మైదానానికి సంబంధించిన స్థలాన్ని కొందరు ఆక్రమించాలని చూస్తున్నారని, వారి నుంచి ఆ స్థలాన్ని కాపాడాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి ఎస్.షాబీర్ బాషా కోరారు. సోమవారం స్థానిక కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ శ్రీకృష్ణదేవరాయల సర్కిల్ సమీపంలో రూ.80 కోట్లు విలువైన భూమిలో మల్టీ ఇన్సిలిటీ నాలెడ్జ్ సెంటర్ నిర్మాణానికి సన్నాహాలు చేస్తున్నారని అన్నారు. ఇది నిర్మిస్తే.. డిజిటల్ లైబ్రరీ ఇంటర్నేషనల్ జర్నల్ స్పోర్ట్స్ కాంప్లెక్స్ పరిశోధన కేంద్రం ఏర్పాటు చేయడాన్ని తాము స్వాగతిస్తున్నామన్నారు. అయితే.. ఈనాలెడ్జ్ సెంటర్‌కు కొంత స్థలాన్ని కేటాయించాలని, క్రీడా మైదానం స్థలం ఆక్రమణకు గురైతే.. భవిష్యత్తులో కళాశాలకు రావాల్సిన కేటాయించిన ఎంబీబీఎస్, పీజీ సీట్లలో కోత పడే ప్రమాదం ఉందని హెచ్చరించారు. ఈ సమావేశంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు సోమన్న, ఉపాధ్యక్షులు ఆల్తాఫ్, దస్తగిరి, రంగా, విజయేంద్ర పాల్గొన్నారు.

మత ప్రచార సభలో రాజకీయం వద్దు

కర్నూలు(న్యూసిటీ), మార్చి 4: మత ప్రచార సభలో రాజకీయం వద్దని ఇస్లాం మత మోటివేషనల్ బ్రదర్ సిరాజ్‌పై ముస్లిం రైట్స్ ప్రొటెక్షన్ ఫోరం (ఎంఆర్‌పీఎఫ్) నాయకులు మండిపడ్డారు. సోమవారం కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో రాష్ట్ర నాయకులు రోషన్ అలీ మాట్లాడుతూ ముస్లింల అభివృద్ధి నినాదంతో బ్రదర్ సిరాజ్ ప్రచార సభల్లో రాజకీయాల గురించి ప్రస్తావించడం సిగ్గుచేటన్నారు. రాజకీ యాల్లో ఆసక్తి ఉంటే ఏదో ఒక పార్టీలో చేరి ప్రచారం చేయాలని హితవు పలికారు. ఈ సమావేశంలో ఎంఆర్‌పీఎఫ్ యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షు డు షోయబుద్దీన్ ఖాద్రి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రజక విద్యార్థులు రాణించాలి

కర్నూలు(ఎడ్యుకేషన్), మార్చి 4: రజక విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలని రజక సేవా సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు సీపీ వెంకటేశ్ అన్నారు. సోమవారం స్థానిక అబ్దుల్లాఖాన్ ఎస్టేట్‌లోని స్కంద కాంప్లెక్స్‌లో నూతన కార్యాలయాన్ని సీపీ వెంకటేశ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రజకుల పిల్లలను అదే వృత్తిలో కొనసాగిస్తూ విద్యకు దూరం చేస్తున్నారన్నారు. జిల్లా మహిళా అధ్యక్షురాలు రేణుక మాట్లాడుతూ తెలంగాణ పోరాట యోధురాలు చాకలి ఐలమ్మను ఆదర్శంగా తీసుకుని రజకులు చైతన్యవంతులు కావాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో టీడీపీ బీసీ సెల్ రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి వెంపెంట రాంబాబు, రజక సాధికార సమితి జిల్లా అధ్యక్షులు గణేష్, రాయలసీమ నాయకులు లింగమయ్య, దేశా య్, వెంకటస్వామి, రామక్రిష్ణ, లీలావతి, శ్రీనివాసులు పాల్గొన్నారు.

వక్ఫ్ భూములకు రక్షణ కల్పించాలి

కర్నూలు(కలెక్టరేట్), మార్చి 4: జిల్లాలో వక్ఫ్ భూములకు రక్షణ కల్పించాలని కోరుతూ సోమవారం స్పందన కార్యక్రమంలో ఎస్‌డీపీఐ నాయకులు జిల్లా జాయింట్ కలెక్టర్ నారపురెడ్డి మౌర్యకు వినితపత్రం అందజేశారు. దిన్నెదేవరపాడు గ్రామ పరిధిలోని సర్వే నెంబరు.19లో వక్ఫ్‌బోర్డు భూము లలో కొందరు అక్రమ నిర్మాణాలు చేపడుతున్నారన్నారు. కార్యక్రమంలో వకీల్ అహ్మద్, జలీల్ అహ్మద్, షేక్ అహ్మద్ పాల్గొన్నారు.

పంట జాబితా సరి చూసుకోండి

కోడుమూరు(రూరల్), మార్చి 4: రబీ పంటల నమోదు జాబితాను రైతులు సరిచూసుకోవాలని వ్యవసాయాధికారి రవిప్రకాష్ తెలిపారు. సోమవారం ప్యాలకుర్తిలో గ్రామసభ నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన జాబితా వివ రాలను చదివి వినిపించారు. కార్యక్రమంలో ఆర్బీకే సిబ్బంది హనీఫ్, బాషా, సుకన్య, రైతులు పాల్గొన్నారు.

ప్యాసింజర్ రైళ్ల చార్జీలు తగ్గింపు

మద్దికెర, మార్చి 4: కేంద్ర ప్రభుత్వం కరోనా సమయంలో ప్యాసింజర్, డెమో రైళ్లను ఎక్స్‌ప్రెస్‌గా మార్చి పెంచిన చార్జీలను ప్రస్తుతం తగ్గించినట్లు రైల్వే స్టేషన్ మాస్టర్ పరమేశ్వరరెడ్డి తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ మద్దికెర నుంచి రూ.35 ఉన్న చార్జీని రూ.10లకు, మద్దికెర నుంచి కర్నూలుకు రూ.55 నుంచి రూ.25, అలాగే మద్దికెర నుంచి కాచిగూడకు రూ.125 నుంచి రూ.75 తగ్గించినట్లు పేర్కొన్నారు. ఈ చార్జీలు ప్యాసింజర్, డెమో రైళ్లకు మాత్రమే వర్తిస్తాయని తెలిపారు.

అందరి కోసం సూపర్ సిక్స్ పథకాలు

మద్దికెర, మార్చి 4: టీడీపీ అధికారంలోకి వస్తే అన్ని వర్గాల ప్రజలను ఆదుకునేందు కోసం సూపర్‌సిక్స్ పథకాలను అమలు చేసేందుకు పూనుకుందని టీడీపీ నాయకుడు అఖిల్ అన్నారు. సోమవారం మద్దికెరలోని టీడీపీ కార్యాలయంలో బాబు ష్యూరిటీ-భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సూపర్ సిక్స్ పథకాలు ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. ప్రతి రోజూ ఈ పథకాలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో పార్టీ విజయం కోసం ప్రతి ఒక్కరూ సైనికుల్లా పని చేయాలని కోరారు. కార్యక్రమంలో మండల టీడీపీ ప్రధాన కార్యదర్శి పెరవలి రామాంజులు, పట్టణ టీడీపీ అధ్యక్షుడు గడ్డం రామాంజులు, మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడు పారా విశోభ, టీడీపీ నాయకులు వర్మ, సుధాకర్ చౌదరి, మోహన్ సీనప్ప, సాయినగర్ బాషా, చంద్ర, తదితరులు పాల్గొన్నారు.

ఓటర్ లిస్టులో ఆ పేర్లు తొలగించాలి

పత్తికొండ టౌన్, మార్చి 4: కనకదిన్నెలో నివాసం లేని వారి పేర్లను అధికార పార్టీ నాయకుల ఆదేశాల మేరకు చేర్చారని, వెంటనే ఆ పేర్లను తొలగించాలని టీడీపీ 83వ బూత్ కమిటీ కన్వీనర్ రామ్మూర్తిగౌడు అధికారులను కోరారు. సోమవారం స్థానిక తహసీల్దార్ మాధవరావును కలిసి వినతి పత్రం అందజేశారు. మండలంలో 83వ బూత్‌లో 341 ఓటర్లు ఉన్నారని, జాబితాలో మాత్రం అధికార పార్టీ నాయకులు ఇక్కడ నివాసం లేని వారిపేర్లను చేర్చారన్నారు. ఈ విషయాన్ని సంబంధిత బీఎల్వోలకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదన్నారు. అధికారులు సమగ్రంగా విచారణ చేసి అక్రమంగా ఓటర్ల జాబితాలో చేర్చినవారి పేర్లను తొలగించాలని డిమాండ్ చేశారు.

ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించారని ధర్నా

మద్దికెర, మార్చి 4: స్థానిక సాయినగర్ కాలనీలో ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించారని కాలనీవాసులు ఆందోళనకు దిగారు. పట్టణ టీడీపీ అధ్యక్షుడు గడ్డం రామాంజనేయులు, మండల ఎస్సీ సెల్ అధ్యక్షులు పారా విశోభ కాలనీ వాసులు ధర్నాకు సంఘీభావం ప్రకటించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సాయినగర్ కాలనీలోని ప్రభుత్వానికి చెందిన 436 పట్టా స్థలాన్ని కొంత మంది అమ్ముకోవాలని చూస్తున్నారని అన్నారు. ఈ కాలనీలో అంగన్‌వాడీ కేంద్రం అద్దె భవనంలో నడుస్తోందని, దీనిని ప్రభుత్వ భవనంలో నిర్వహించాలని కోరారు. విచారణ చేపట్టి అక్రమార్కులపై చర్యలు తీసుకోవాలని కోరారు. అనంతరం తహసీల్దార్ రజాక్‌వలికి వినతిపత్రం అందజేశారు.

టీడీపీ కోసం సైనికుల్లా పని చేయాలి

తుగ్గలి, మార్చి 4: తెలుగుదేశం పార్టీ విజయం కోసం ప్రతి కార్యకర్త సైనికుడిలా పని చేయాలని టీడీపీ పట్టణ అధ్యక్షుడు లక్ష్మణస్వామి యాదవ్, రవి యాదవ్ అన్నారు. సోమవారం మండల పరిధిలోని జొన్నగిరిలో వారు టీడీపీ కార్యకర్తలతో మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో టీడీపీ గెలుపు కోసం ప్రతి ఒక్కరూ పని చేయాలని, వైసీపీ అరాచక పాలన నుంచి ప్రజలకు విముక్తి కల్పించాలని సూచించారు. అన్ని వర్గాలను వంచించిన వైసీపీ ప్రభుత్వానికి ఓటుతోనే బుద్ధి చెప్పాలని కోరారు.

వలసలను అరికట్టాలి

ఆదోని రూరల్, మార్చి 4 : గ్రామాల ప్రజలు వలసలు వెళ్లకుండా నివారించి తక్షణమే కూలీలకు ఉపాధి పనులు కల్పించాలని రైతు సంఘం నాయకులు వెంకటేశులు, తిక్కప్ప, లింగన్న డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా వారు సంతేకుడ్లూరు, పెద్దహరివాణం, మదిరె గ్రామాల్లో పర్యటించి, ఉపాధి కూలీలతో సమావేశమయ్యారు. 18 వారాలుగా కూలీలకు వేతనాలు పడలేదని, దీంతో వలసలు వెళ్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఉపాధి కూలీల సమస్యల పరిష్కారం కోసం నేడు సబ్ కలెక్టర్ కార్యాలయాన్ని ముట్టడిస్తున్నట్లు తెలిపారు.

ఉపాధి సిబ్బంది డిమాండ్లు పరిష్కరించాలి

వెల్దుర్తి, మార్చి 4 : పట్టణంలో స్థానిక మహాత్మాగాంధీ జాతీయ ఉపాధిహామీ కార్యాలయం ఎదుట ఉపాధి సిబ్బంది తమ డిమాండ్లు పరిష్కరించాలని కోరుతూ ఎన్‌ఆర్‌ఈజీఎస్ టెక్నికల్ అసిస్టెంట్ జిల్లా కార్యదర్శి నాగేశ్వర్‌రెడ్డి ఆధ్వర్యంలో సోమవారం నిరసన వ్యక్తం చేశారు. ఈ నిరసనకు సంఘీభావంగా వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కెవి.నారాయణ ముఖ్యఅతిథిగా హాజరై మద్దతు తెలిపారు. ఉద్యోగులను క్రమబద్ధీకరణ చేయాలని, పీఆర్‌సి 23శాతం అమలు చేయాలని, వేతనాలు పెంచాలని, హెల్త్ కార్డులు మంజూరు చేయాలని నినదించారు. కార్యక్రమంలో ఏపీఓ రాజునాయక్, టెక్నికల్ అసిస్టెంట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు, సిబ్బంది పాల్గొన్నారు.

గ్రంథాలయానికి పుస్తకాల వితరణ

వెల్దుర్తి, మార్చి 4 : పట్టణంలోని గ్రంథాలయానికి పోటీ పరీక్షలకు ఉపయోగపడే పుస్తకాలను గ్రామానికి చెందిన శ్రీనివాసరావు, వారి కుమార్తె దుర్గ సోమవారం గ్రంథాలయ అధికారి కవితాబాయికి అందజేశారు. పోటీ పరీక్షలకు సన్నద్ధమయ్యే అభ్యర్థులు ఈ పుస్తకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. హెల్పింగ్ హ్యాండ్స్ సొసైటీ అధ్యక్షుడు హరిసింహనాయుడు పాల్గొన్నారు.

దివ్యాంగులకు 5 శాతం రిజర్వేషన్ కల్పించాలి

గోనెగండ్ల, మార్చి 4: ప్రభుత్వం ఏర్పాటు చేసిన ప్రతి రిజర్వేషన్‌లో దివ్యాంగులకు ఐదు శాతం రిజర్వేషన్ కల్పించే విధంగా చర్యలు తీసుకునేవరకు పోరాటం చేస్తామని జిల్లా దివ్యాంగుల హక్కుల పోరాట సమితి మహిళా సంఘం అధ్యక్షురాలు నాగేశమ్మ, మండల శాఖ అధ్యక్షుడు సుంకన్న, మునిస్వామి అన్నారు. సోమవారం వారి కార్యాలయం దగ్గర నిరసన తెలిపారు. అనంతరం సంఘం నాయకులు మాట్లాడుతూ దివ్యాంగులకు పెన్షన్ రూ. 6వేలకు పెంచాలని, శారీరక దివ్యాంగులకు రోస్టర్ 56ను బదిరులు రోస్టర్ 31ని 10 లోపు మార్చేందుకు ఇతర డిమాండ్ల సాధనల కోసం ఈనెల 9వ తేదీన మధ్యాహ్నం అమరావతిలోని ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం ఎదురుగా దివ్యాంగుల సింహగర్జన సభ చేపగుతున్నట్లు తెలిపారు. అనంతరం కరపత్రాలను విడుదల చేశారు. సంఘం నాయకులు మహబుబ్‌బాషా, సన్నప్ప, రాముడు, బోంబాయి షఫీబాషా పాల్గొన్నారు.

జగన్ హామీలు అమలు చేయాలి

ఎమ్మిగనూరు రూరల్, మార్చి 4:; సీఎం జగన్మోహన్‌రెడ్డి పాదయాత్రలో ఉపాధి హామీ సిబ్బందికి ఇచ్చిన హామీలను నెరవేర్చాలని మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ఉద్యోగులు డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక కార్యాయం ఎదుట నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఉపాధి సిబ్బంది తిరుమల్ నాయుడు, మోహన్‌ప్రసాద్, లక్ష్మీ, సులోచనలు మాట్లాడుతూ జగన్ అధికారం చేపట్టినప్పటి నుండి ఇప్పటి వరకు తమకు వేతనాలు పెంచలేదన్నారు. అన్ని డిపార్ట్‌మెంట్లకు 23శాతం పీఆర్‌సీని కల్పించి ఉపాధి హామీ సిబ్బందికి మాత్రం మొండిచేయి చూపారన్నారు.

నేడు పూలచింతలో బండేగురు జాతర

నందవరం, మార్చి4: మండల పరిధిలోని పూలచింత గ్రామంలో మంగళవారం నవమి వేడుకలు ఘనంగా నిర్వహిస్తున్నట్లు టీడీపీ సీనియర్ నాయకుడు, ఉప పీఠాధిపతి బండేగురుస్వామి, సర్పంచ్ అక్కమాంబ దేవి వెల్లడించారు. ఈ మేరకు 118వ జాతర మహోత్సవం సందర్భంగా ఆలయంలో సోమవారం ప్రత్యేక పూజలు జరిగాయి. ఈ సందర్భంగా ఉప పీఠాధిపతి మాట్లాడుతూ నవమి సందర్భంగా ఉదయం సుప్రభాత సేవ, బండేగురు మూర్తికి రుద్రాభిషేకం, పల్లకోత్సవం, నందికోలుసేవ , సాయంత్రం రథోత్సవం, భజన కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు.



శివయ్యకు ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న గురుస్వామి

రామళ్లకోటలో 150 వైసీపీ కుటుంబాలు

టీడీపీలో చేరిక



కేఈ శ్యాంబాబు సమక్షంలో టీడీపీలో చేరుతున్న నాయకులు

వెల్దుర్తి, మార్చి 4 : రామళ్లకోట గ్రామంలో పత్తికొండ నియోజకవర్గ టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి కేఈ శ్యాంబాబు సమక్షంలో వైసీపీకి చెందిన 150 కుటుంబాలు టీడీపీలోకి చేరారు. ఈ సందర్భంగా రామళ్లకోట నాయకులు పెద్దయ్యగారి రామస్వామి, చింతకాయల, గోపాల్, పెద్దమాధవస్వామి, చిన్నమాధవస్వామి, గోరంట్ల, గోవిందు, ఎల్లస్వామి, ఎర్రమల, వడ్డెరాజు, మహేష్, రాము, పిజి మధు, మునిచంద్ర, దాసరి స్వాములు, సుగుణాకర్, సి మధు, గణేష్, తిమ్మయ్య మాట్లాడుతూ రాష్ట్రంలో అన్ని వర్గాల ప్రజలు కష్టాల్లో ఉన్నారని, టీడీపీ అధినేత నారాచంద్రబాబు నాయుడు సీఎం అయితేనే సమస్యలు తీరుతాయని స్పష్టం చేశారు. ముందుగా బస్టాండ్ కూడలిలో టీడీపీ వ్యవస్థాపకులు కీర్తిశేషులు నందమూరి తారక రామరావుకు చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. అనంతరం తెలుగుదేశం పార్టీ జెండాను ఆవిష్కరించారు. గ్రామంలో కొలువైన పురాతన వనం లక్ష్మీవెంకటేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు చేశారు. గ్రామ వీధుల గుండా పూలమాలలతో సత్కరిస్తూ బాణసంచాలు పేలుస్తూ నాయకులు, కార్యకర్తలు ఊరేగించారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు శివశంకర్‌రెడ్డి, మండల అధ్యక్షులు బలరాంగౌడ్, సుబ్బరాయుడు, జ్ఞానేశ్వర్‌గౌడ్, జయరాముడు, రామకృష్ణ ఆచారి, రామకృష్ణ, అమర్‌నాథ్ గౌడ్, చంద్రన్న, శశి, వెంకటరాముడు, నాగేశ్వర్‌రెడ్డి, సుధాకర్‌గౌడ్ తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

డబ్బు సంచులతో వస్తున్నారు.. జాగ్రత్త : బీవీ

● 32వ వార్డులో మాజీ ఎమ్మెల్యే బీవీ ప్రచారం



టీ కొట్టు నిర్వాహకుడితో మాట్లాడుతున్న బీవీ జయనాగేశ్వరరెడ్డి

ఎమ్మిగనూరు, మార్చి 4: ఎన్నికలు సమీపిస్తుండడంతో వ్యాపారులు డబ్బు సంచులతో వస్తున్నారు జాగ్రత్తగా ఉండాలని, వారు ఇచ్చే డబ్బును తీసుకొని సైకిల్‌కు ఓటు వేయాలని మాజీ ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి అన్నారు. సోమవారం పట్టణంలోని బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారంటీ కార్యక్రమాన్ని 32వ వార్డులో నిర్వహించారు. ముందుగా ఇంటింటికీ తిరుగుతూ టీడీపీ సూపర్ సిక్స్ పథకాలను వివరించారు. అనంతరం స్థానికంగా ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో సాగు, తాగునీరు లేక ప్రజలు ఇబ్బందులు పడుతుంటే వైసీపీ ఎమ్మెల్యేలు చోద్యం చూస్తున్నారని మండిపడ్డారు. ప్రాజెక్టులను అటకెక్కించారన్నారు. బీసీలపై జగన్‌ది కపట ప్రేమ అని, 54కులాలకు కార్పొరేషన్లు ఏర్పాటు చేసి చైర్మన్లుగా నియమించి ఒక్క రూపాయి విదిల్చిన పాపాన పోలేదని విమర్శించారు. వచ్చే ఎన్నికల్లో వైసీపీకి బుద్ధిచెప్పేందుకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. వార్డు ఇన్‌చార్జీ, మాజీ కౌన్సిలర్ పార్వతి, మాజీ వైస్‌చైర్మన్ కొండయ్య చౌదరి, కౌన్సిలర్లు దయాసాగర్, రామదాసు గౌడ్, నాయకులు సుందరరాజు, మిఠాయి నరసింహులు, రామకృష్ణనాయుడు, రంగస్వామి గౌడ్ పాల్గొన్నారు.

కార్యకర్తల కుటుంబాలకు అండగా ఉంటాం

గోనెగండ్ల : టీడీపీ కుటుంబాలకు తెలుగుదేశం పార్టీ ఎల్లవేళల అండగా ఉంటుందని మాజీ ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి అన్నారు. సోమవారం తెల్లవారు జామున కులుమాల గ్రామానికి చెందిన ఖాజా అనే కార్యకర్త గుండెపోటుతో మృతి చెందాడు. విషయాన్ని తెలుసుకున్న బీవీ జయనాగేశ్వరరెడ్డి గ్రామాన్ని సందర్శించి కుటుంబ సభ్యులను పరామర్శించారు. దహన సంస్కారాలకు రూ.30 వేల ఆర్థిక సాయం అందజేశారు. వారికి అండగా టీడీపీ ఎల్లవేళల ఉంటుందని వారికి భరోసా ఇచ్చారు. ఖాజా మృతి టీడీపీకి తీరని లోటని నివాళి అర్పించారు. అలాగే హెచ్ కైరవాడి గ్రామంలో మూడు రోజుల క్రితం టీడీపీ నాయకుడు కర్రెన్న భార్య దీవెనమ్మ గుండె పోటుతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న బీవీ కర్రెన్న కుటుంబాన్ని పరామర్శించారు. వారి కి రూ.10 వేల ఆర్థిక సాయం అందజేశారు. గోనెగండ్లలో టీడీపీ నాయకుడు శ్రీధర్ ఇటీవల కింద పడి చేతికి గాయం కావడంతో శస్త్ర చికిత్స చేయించారు. బీవీ వారి ఇంటికి వెళ్లి పరామర్శించారు. టీడీపీ కన్వీనర్ నజీర్‌సాహెబ్, తిరపత్యనాయుడు, కులుమాల రాముడు, చాంద్‌బాషా, కులుమాల మాజీ సర్పంచు రామిరెడ్డి, నూరహమ్మద్, బేతాలబడేసా, రామాంజినేయులు, రంగస్వామినాయుడు పాల్గొన్నారు.

కడుపు కొడుతున్నారు..

● రెండు నెలలుగా సరుకులు పంపిణీ చేయని డీలర్లు

● పట్టించుకోని రెవెన్యూ అధికారులు



రెండు నెలలుగా బియ్యం అందడం లేదని చెబుతున్న గ్రామస్తులు

హొళగుంద మార్చి 4: 'రెండు నెలలుగా రేషన్ బియ్యం వేయడం లేదు.. గట్టిగా అడిగితే బెదిరిస్తున్నారు.. ప్రభుత్వం నుంచి రాలేదని చెబుతూ మా కడుపు కొడుతున్నారు' అంటూ గంజిహళ్లి గ్రామానికి చెందిన రేషన్ లబ్ధిదారులు ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం వారు ఆంధ్రజ్యోతితో తమ వేదన వినిపించారు. మండలంలోని గజ్జెహళ్లి గ్రామంలో రెండు చౌక దుకణాలు ఉన్నాయి. ఎఫ్‌పీ షాప్ నెం 11, 28లో 1254 మంది కార్డుదారులు ఉన్నారు. వీరికి నెల నెలా ప్రభుత్వం నుంచి 189 క్వింటాళ్ల బియ్యం సరఫరా అవుతోంది. కొందరికి మాత్రమే బియ్యం పంపిణీ చేసి, మిగతా వారికి రెండు నెలలు అయినా ప్రభుత్వం నుంచి రాలేదని చెబుతున్నారని కార్డుదారులు తెలిపారు. అయితే అలాట్మెంట్‌లో మాత్రం బియ్యం, చక్కెర, బ్యాళ్లు, కార్డుదారులకు పంపిణీ చేసినట్లు రికార్డులలో నమోదు చేసి తమ కడుపు కొడుతున్నారని కార్డుదారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సరుకులు సక్రమంగా పంపిణీ చేయాలని అడిగితే ఎవ్వరికి చెప్పుకుంటావో.. చెప్పుకో అంటూ మహిళలు అని చూడకుండా బూతులు తిడుతున్నారని మహిళలు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయం పై తహసీల్దార్ ఏఎం ప్రసాద్ రాజును వివరణ కోరగా.. ఆర్‌ఐతో విచారణ చేయించి సంబంధిత డీలర్ల పై చర్యలు తీసుకుంటామని తెలిపారు.

శ్రీశైలం వెళ్లే భక్తులకు ప్రత్యేక బస్సులు

ఆదోని (అగ్రికల్చర్), మార్చి 4: శివరాత్రి ఉత్సవాల్లో భాగంగా శ్రీశైలం మల్లన్న దర్శనార్థం వెళ్లే భక్తులకు ఆదోని డిపో నుంచి ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేసినట్లు డిపో మేనేజర్ మహ్మద్ రఫీ తెలిపారు. ఈ నెల 1 నుంచి 11వ తేదీ వరకు బస్సులను ఏర్పాటు చేశామన్నారు. వెళ్లే భక్తుల రద్దీకు అనుగుణంగా ఏర్పాటు చేస్తామన్నారు. ఆరో తేదీ నుంచి శివరాత్రి ఉత్సవాలు ముగింపు వరకు ఆదోని నుంచి శ్రీశైలంకు 60 బస్సులు, ఎనిమిదో తేదీ నుంచి రుద్రాభిషేకం, పాగాలంకరణ రోజున 79 సర్వీసులను నడుపుతున్నామన్నారు. ఈ అవకాశాన్ని ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఒక బృందంగా ఏర్పడి వచ్చినవారికి ప్రత్యేక బస్సును ఏర్పాటు చేస్తామన్నారు.

డీహైడ్రేషన్ యూనిట్‌ను తొలగించండి

● పంచాయతీ కార్యదర్శికి గ్రామస్థుల వినతి

● అనుమతులు ఉన్నది అనుమానమే



గ్రామ పంచాయతీ కార్యదర్శికి వినతి పత్రం అందజేస్తున్న గ్రామస్థులు

గోనెగండ్ల, మార్చి 4: ప్రజల అనారోగ్యాలకు కారణం అవుతున్న ఫ్రూట్స్ అండ్ విజిటబుల్స్ సోలార్ డీహైడ్రేషన్ యూనిట్‌ను తొలగించాలని పెద్దనేలటూరు గ్రామస్థులు డిమాండ్ చేశారు. సోమవారం గ్రామస్థులు సుభాన్, చిన్ననరసింహులు, ఖాజా, శ్రీనివాసులు, షఫీ బాషాతో పాటు మరో 25 మంది పంచాయతీ కార్యదర్శిని కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా గ్రామస్థులు మాట్లాడుతూ మూడు నెలల నుంచి గ్రామంలోని వీధుల్లో కొందరు వ్యక్తులు కొత్తగా ఫ్రూట్స్ అండ్ విజిటబుల్స్ సోలార్ డీహైడ్రేషన్ యూనిట్ పేరుతో ఏపీ ఫుడ్ ప్రాసెసింగ్ సొసైటీ అనే సంస్థ వారు మిషనరీలతో ఉల్లి, టమోటా, ఆలు వంటి కూరగాయలను కట్టింగ్ చేసి వీటిని మిషనరీ ద్వారా ఎండ బెట్టి వ్యాపారం చేస్తున్నారు. అయితే ఇలాంటి డీహైడ్రేషన్ మిషనరీ గ్రామ శివారులో ఉండాలి కాని గ్రామ వీధుల్లో నివాసాల పక్కన ఏర్పాటు చేయడం వల్ల ప్రజలు అనారోగ్యానికి గురవుతున్నారని పేర్కొన్నారు. మిషనరీల వల్ల దుర్గంధం రావడంతో పిల్లలకు జ్వరాలు, శ్వాస ఆగిపోవడం, కళ్ల మంటలు రావడం, ముసలివారికి అలర్జీ, దగ్గు, ఆయాసం వస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. వీటి వ్యర్థల వల్ల భరించలేని దుర్గంధం వస్తోందన్నారు. ఈ మిషనరీలకు గ్రామ పంచాయతీ, ప్రభుత్వ అనుమతులు ఉన్నాయా లేవా అని అధికారులు విచారణ చేసి చర్యలు తీసుకోవాలని కోరారు. లేక పోతే గ్రామ పెద్దలతో కలసి ఉద్యమిస్తామని వారు హెచ్చరించారు.

ఈ ముగ్గురికి ఎందుకు స్థలం చూపడం లేదు?

● నందవరం తహసీల్దార్‌పై సబ్ కలెక్టర్ సీరియస్

ఆదోని రూరల్, మార్చి 4 : జగనన్న కాలనీలో 46మందికి స్థలాలను రిజిష్టర్ చేశారని, ముగ్గురికి మాత్రం ఎందుకు చూపడం లేదని సబ్ కలెక్టర్ శివ నారాయణ శర్మ నందవరం తహసీల్దార్‌ను ఫోన్‌లో నిలదీశారు. బాధితులు ముగ్గురికి స్థలం చూపించాలని, లేనిపక్షంలో చర్యలు తప్పవంటూ సబ్ కలెక్టర్ హెచ్చరించారు. సోమవారం స్పందన కార్యక్రమంలో భాగంగా ఎమ్మిగనూరు నియోజకవర్గం నందవరం మండలం హలహర్వి గ్రామానికి చెందిన దస్తగిరి, బుడ్డమ్మ, శేకమ్మ, రమీజానమ్మ సబ్ కలెక్టర్‌ను కలిసి తమ వేదన వినిపించారు. గ్రామంలో జగనన్న కాలనీలో 49మంది లబ్ధిదారుల స్థలాలను వైసీపీ నాయకులు కబ్జా చేశారని, పోరాటాలు చేయగా 46మందికి స్థలాలను రిజిష్టర్ చేశారని, తమకు మాత్రం చేయడం లేదని ఫిర్యాదు చేశారు. దీంతో స్పందించిన సబ్ కలెక్టర్ శివ నారాయణ శర్మ నందవరం తహసీల్దార్‌కు ఫోన్ చేసి ముగ్గురికి స్థలం చూపించాలని ఆదేశించారు. అలాగే హిందూ దేవాలయ భూములను పరిరక్షించాలని, కబ్జాకు గురికాకుండా చూడాలని నాయకులు రామాంజనేయులు ఆధ్వర్యంలో సబ్ కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు. 75 ఏళ్లుగా తమ కుటుంబాలు కొఠారిమిల్లు సమీపంలోని స్థలంలో నివాసం ఉంటున్నామని, ఇప్పుడు ఖాళీ చేయమని ఒత్తిడి చేస్తున్నారని, తమకు న్యాయం చేయాలని బాలరాజు, ఆనందప్ప, శారదమ్మ, సుశీలమ్మ, యశోద, లలితమ్మ, రాజు, సబ్ కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు.

ఎన్నికల కోడ్‌కు ముందే ఇళ్ల స్థలాలు ఇవ్వాలి

● జిల్లా వ్యాప్తంగా జర్నలిస్టుల ఆందోళన



ఎమ్మిగనూరులో వినతిపత్రం ఇస్తున్న జర్నలిస్టులు

పత్తికొండ టౌన్, మార్చి 4: రాష్ట్ర ప్రభుత్వం జర్నలిస్టులకు ప్రకటించిన ఇళ్ల స్థలాలను ఎన్నికల కోడ్ రాకముందికే ఇవ్వాలని ఏపీయూడబ్ల్యూజే నియోజకవర్గ గౌరవాధ్యక్షుడు రంగన్న, అధ్యక్షుడు సాలు రంగడు, ప్రధాన కార్యదర్శి ఓబులేసు డిమాండ్ చేశారు. జిల్లా కమిటీ పిలుపులో భాగంగా ఏపీయూడబ్ల్యూజే ఆధ్వర్యంలో ఆర్డీవో రామలక్ష్మికి జర్నలిస్టులు వినతి పత్రం ఇచ్చారు. గతంలో జర్నలిస్టుల సంక్షేమం కోసం అనేక పథకాలు ఇస్తామని ఆశ చూపారని, నేటికీ ఆచరణకు నోచుకోలేదని పేర్కొన్నారు. ఇప్పటికైనా చిత్తశుద్ధితో జర్నలిస్టులకు న్యాయం చేయాలని కోరారు. నాయకులు హనుమంతు, ఫక్కీరప్ప, రమేష్, మంజునాథ్ పాల్గొన్నారు.

పెద్దకడుబూరు : అర్హులైన జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని ఏపీయూడబ్ల్యూజే నాయకులు పుల్లయ్య, బీమన్న, ఈరన్న డిమాండ్ చేశారు. తహసీల్దార్ సురేష్ బాబుకు వినతి పత్రం అందజేశారు.

కోసిగి : ఏపీయుడబ్లూజే జిల్లా కమిటి పిలుపు మేరకు జిల్లా సహాయ కార్యదర్శి హనుమేష్, తాలుకా ఉపాధ్యక్షులు శ్రీరామ్, మండల అధ్యక్షులు షబ్బీర్, మండల గౌరవాధ్యక్షుడు గడ్డం వీరన్న మురళిని కలిసి వినతి పత్రం అందజేశారు.

ఆలూరు: ఎన్నికల కోడ్ వచ్చేలోగా జర్నలిస్టులకు ఇళ్ల స్థలాల పంపిణీ ప్రక్రియను వేగవంతం చేయాలని కోరుతూ ఏపీయూడబ్ల్యూజే ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా స్పందనలో తహసీల్దార్ చంద్రశేఖర్‌కు వినతిపత్రం అందజేశారు.

ఎమ్మిగనూరు : ఎన్నికల కోడ్ వచ్చేలోపు జిల్లాలో అర్హులైన ప్రతి జర్నలిస్టుకు నివాస స్థలం కేటాయించాలని ఏపీయూడబ్ల్యూజే ఎమ్మిగనూరు తాలూకా ప్రధాన కార్యదర్శి చిన్నాకుల నాగరాజు, పట్టణ అధ్యక్షులు జీబీ పరమేశ్వర, జిల్లా కమిటీ సభ్యులు నూర్‌అహ్మద్, జాలవాడి బాషా ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం సంఘం జిల్లా కమిటీ పిలుపు మేరకు తహసీల్దార్ శేషారెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు.

నాసిరకం భోజనంపై విచారణ

● స్పందించిన జిల్లా విద్యాశాఖ అధికారి

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

హొళగుంద మార్చి 4: ముద్దటమాగి గ్రామ మండల పరిషత్ ఆదర్శ ప్రాథమిక పాఠశాలలో పిల్లలకు నాణ్యతలేని ఆహారం అందిస్తున్న మధ్యాహ్న భోజన నిర్వాహకులపై జిల్లా విద్యాశాఖ అధికారి శ్యామ్యూల్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ నెల మూడవ తేదీన ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన "ఈ అన్నం ఎలా తినాలి" అనే కథనానికి డీఈఓ స్పందించారు. పాఠశాల మధ్యాహ్న భోజనం పథకంపై విచారణ చేపట్టాలని ఎంఈవోలు సత్యనారాయణ, జగన్నాథ్‌ను ఆదేశించారు. విద్యార్థులు, వారి తల్లిదండ్రులను విచారించగా కూరగాయలు లేకుండా వంట చేస్తున్న విషయాన్ని వారి దృష్టికి తేగా వంట నిర్వాకులపై ఆగ్రహం వ్యక్తం చేసినట్లు తెలిపారు. మరోసారి ఇలాంటి తప్పిదం జరుగకుండా చూడాలని లిఖితపూర్వకంగా రాయించుకున్నారు. జిల్లా ఉన్నత అధికారులకు నివేదిక అందిస్తామని తెలిపారు.

జగన్ ప్రభుత్వానికి గడ్డు కాలమే

● ప్రశాంత్ కిషోర్ సర్వేలో కూడా టీడీపీదే అధికారం

● టీడీపీ రాష్ట్ర కార్యదర్శి వైకుంఠం మల్లికార్జున చౌదరి



బ్రోచర్ ప్రదర్శిస్తున్న వైకుంఠం మల్లికార్జున చౌదరి

ఆలూరు, మార్చి 4: జగన్ ప్రభుత్వానికి ఇక గడ్డుకాలమేనని ప్రశాంత్ కిషోర్ సర్వేలోనూ తేటతెల్లం అయ్యిందని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి వైకుంఠం మల్లికార్జున చౌదరి అన్నారు. సోమవారం ఆలూరులో ఆయన స్వగృహంలో టీడీపీ మేనిఫెస్టోలో రూపొందించిన సూపర్ సిక్స్ పథకాల బ్రోచర్‌లను ఆయన ప్రదర్శించారు. రాష్ట్రంలో మేనిఫెస్టోలో రూపొందించిన ఆరు పథకాల బ్రోచర్‌లను ఆయన ప్రదర్శించారు. రాష్ట్రంలో అవినీతి పాలనను అంతమొందించేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. జగన్ ఓటమి భయంతో మేకపోతు గాంబీర్యాన్ని ప్రదర్శిస్తున్నాడని పేర్కొన్నారు. రాష్ట్రంలో టీడీపీ, జనసేన కూటమి నేతృత్వంలో టీడీపీ ప్రభుత్వం ఏర్పాటు కావడం ఖాయమన్నారు. జగన్ పథకాల పేరుతో ఎన్ని జిమ్మిక్కులు చేసినా ముఖ్యమంత్రి కాలేరన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ భీమలింగప్ప, మాజీ సొసైటీ అధ్యక్షుడు నౌనేపాటి చౌదరి, టీడీపీ నాయకులు మల్లేష్, జహీర్, సీనప్ప, అమర్, నేమకలప్ప, కర్రెన్న పాల్గొన్నారు.

అధికారులు బాగా పని చేయాలి : జడ్పీటీసీ

తుగ్గలి, మార్చి 4: గ్రామాల్లో నెలకొన్న సమస్యలు పరిష్కారం కావాలంటే అధికారులు బాగా పని చేయాలని అప్పుడే సమస్యలు పరిష్కారమవుతాయని జడ్పీటీసీ సభుక్యలు పులికొండ నాయక్ అన్నారు. సోమవారం ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీపీ ఆదేమ్మ అధ్యక్షతన నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో మండల అధికారులు, వారి శాఖకు సంబంధించిన వివరాలను చదివి వినిపించారు. అలాగే భవిష్యత్తులో చేపట్టే అభివృద్ధి కార్యక్రమాల గురించి చర్చించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గిరిజన తండాలకు వెళ్లే రహదారులు సీసీ రోడ్ల పక్కన ఉన్న పొలాలు కుచించుకుపోతున్నాయని అన్నారు. సమావేశంలో ఎంపీడీవో విజయలక్ష్మి, తహసీల్దార్ షర్మిల, వైస్ ఎంపీపీ మల్లికార్జున రెడ్డి, ఏఈ మహేశ్వరరెడ్డి, చంద్రశేఖర్, వైద్యులు ప్రవీణ్‌కుమార్ ఉన్నారు.

పరిహారాన్ని రైతు ఖాతాల్లో జమ చేయాలి

పత్తికొండ టౌన్, మార్చి 4: గత ఏడాది వర్షాభావ పరిస్థితుల కారణంగా నష్టపోయిన రైతాంగాన్ని ఆదుకునేందుకు తక్షణమే పంట నష్టపరిహారం రైతు ఖాతాల్లోకి జమ చేయాలని రైతు సంఘం జిల్లా కార్యదర్శి రాజాసాహేబ్, నియోజకవర్గ అధ్యక్షుడు వీరన్న, గౌరవాధ్యక్షుడు కారన్న డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక తహసీల్దార్ మాధవరావుకు రైతు సంఘం నాయకులు వినతి పత్రం ఇచ్చారు. గత ఏడాది వర్షాలు లేక రైతులు వేసిన పంటలన్నీ దెబ్బతిని ఆర్థికంగా చితికిపోయారని, ప్రభుత్వం కరువు మండలాలుగా ప్రకటించినప్పటికీ ఇంత వరకు ఎలాంటి సహాయం చేయలేదని విమర్శించారు. రైతు సంఘం నాయకులు పెద్దహుల్తి హుసేనీ, పెద్దయ్య, నాగిరెడ్డి, మారెల్ల కౌలుట్ల తదితరులు పాల్గొన్నారు.

అక్రమ పైపులైన్ పనులు ఆపాలి

మద్దికెర, మార్చి 4: మద్దికెర నుంచి ఎరవలి, బొమ్మనపల్లి గ్రామాల మీదుగా హంద్రీనీవా నుంచి నీరు తరలిస్తున్న పైపులైన్ పనులు వెంటనే ఆపాలని సీపీఎం మండల కార్యదర్శి కడవల రవికుమార్, జనసేన పార్టీ నాయకులు బద్దెల రాజు అన్నారు. సోమవారం ఎడవలి గ్రామం వద్ద జరుగుతున్న పైపులైన్ పనుల వద్ద నిరసన తెలపారు. తుగ్గలి మండలంలోని మైసూరు చెందిన ప్రైవేటు గోల్డ్‌మెన్స్‌కు హంద్రీనీవా నీటిని తరలిస్తున్నారని రైతుల వద్ద ఎలాంటి అనుమతులు లేకున్నా ఇష్టానుసారంగా గుంతలు తవ్వి పైపులైన్ వేసి నీటిని తరలించడం అన్యాయమని పేర్కొన్నారు. అక్రమంగా వేసుకున్న పైపులైన్ పనులను వెంటనే నిలిపివేయాలని లేకపోతే ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. సీఐటీయూ మండల కార్యదర్శి రాముడు, కేవీపీఎస్ జిల్లా సహాయ కార్యదర్శి రమేష్, ఎస్ఎఫ్ఐ మండల ఉపాధ్యక్షుడు శివ, తదితరులు ఉన్నారు.

కుక్కల నియంత్రణ కోసం చర్యలు చేపట్టాలి

ఆదోని టౌన్, మార్చి 4: పట్టణంలో విపరీతంగా పెరిగిపోతున్న కుక్కల నియంత్రణ కోసం చర్యలు చేపట్టాలని బీజేపీ ఆదోని అసెంబ్లీ కో-కన్వీనర్ నాగరాజ్ గౌడ్, ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు మలేకర్ శ్రీనివాస్ అన్నారు. సోమవారం విలేకరులతో మాట్లాడుతూ.. పట్టణంలోని కొన్ని ప్రాంతాలలో కుక్కల సంఖ్య అధికంగా ఉండటంతో ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కోవాల్సిన పరిస్థితులు ఉన్నాయని అన్నారు. ఇటీవల 25వ వార్డులో ఒక బాలుడు చనిపోయిన సంఘటనను గుర్తుచేశారు.

గడ్డివాము పై నుంచి పడి వ్యక్తి మృతి

వెల్దుర్తి, మార్చి 4 : ప్రమాదవశాత్తు గడ్డివాము పై నుంచి పడి వ్యక్తి మృతి చెందిన ఘటన మండలంలో చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు మండలంలో గోవర్ధనగిరి గ్రామానికి చెందిన వడ్డెరాముడు రోజూమాదిరిగానే గడ్డివాము పేర్చడానికి సోమవారం కూలికి వెళ్లాడు. గడ్డివాము పేర్చడం దాదాపు పూర్తవుతున్న సమయంలో ప్రమాదవశాత్తు గడ్డివాము పై నుంచి కింద పడి మృతిచెందాడు. పత్తికొండ టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి కేఈ.శ్యాంబాబు మృతుని పార్థివదేహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. మృతుడి కుటుంబానికి అండగా ఉంటామని తెలిపారు.

అంగన్‌వాడీ కేంద్రాల్లో నీటి కొరత తీర్చాలి

మద్దికెర, మార్చి 4: మద్దికెరలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో నెలకొన్న నీటి కొరతను తీర్చాలని అంగన్‌వాడీ కార్యకర్తలు తహసీల్దార్ రజాక్‌వలిని కోరారు. సోమవారం అంగన్‌వాడీ నిర్వాహకులు మాట్లాడుతూ కేంద్రాల్లో అంతా చిన్న పిల్లలే ఉంటారని, పంచాయతీ వారు నీరు వదలడం లేదని తెలిపారు.